ఆగస్టు 2025

రు. 20/-


# చైతన్యం

సంకల్ప బలం



79వ స్వాతంత్ర్యదిన శుభాకాంక్షలు


ఫిలిప్పీన్స్ అధ్యక్షునికి ఘనస్వాగతం


దాశరథి కృష్ణమాచార్య
శతజయంతి ఉత్సవాలు



వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**

# చైతన్యం

సంకల్ప బలం

**సామాజిక విలువల మాస పత్రిక**

**ఆగస్టు 2025**

సంపుటి -14 సంచిక - 11

## ఈ సంచికలో....

| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| రాష్ట్రపతి ప్రసంగం | 6 |
| స్వాతంత్ర్యం -అంతరంగం | 7 |
| ఆస్ట్రోనాట్ కు అభినందనల వెల్లువ | 9 |
| శుక్లపక్షం | 12 |
| వార్తా విశేషాలు | 13 |
| కాశీమజిలీ కథలు | 23 |
| క్రాంతివీరుడు శ్యామ్ జీ కృష్ణవర్మ | 25 |
| షడ్దర్శనాలు | 31 |
| భారతదేశ అభివృద్ధిలో భాగస్వామ్యులు | 32 |
| బ్రహ్మ ఖండం | 34 |
| కొడకా! జర భద్రం | 35 |
| జ్ఞాపకాల దొంతరలో | 36 |
| కలియుగ ప్రత్యక్ష దైవం | 37 |
| యాదగిరిగుట్ట | 38 |
| చైతన్యరూపిణియే అమ్మ | 42 |
| మధురస్వప్నం | 43 |
| గజేంద్రమోక్షము | 44 |
| శ్రీకరం 2050 | 45 |
| జర్నలిస్టులపై సిఎం వ్యాఖ్యలు | 47 |
| రాంప్రసాద్ అగ్యత్ (బిస్మిల్) | 48 |

రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

పాఠక దేవుళ్ళకు 79 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు -- కృష్ణాష్టమి శుభాకాంక్షలు

'భారత్ మాతాకీ జై --- అజీ మల్ల ఖాన్'

దేశాన్ని బానిస సంకెళ్ళ నుండి విముక్తి చేసేందుకు ఎంతో మంది ఎన్నో ఉద్యమాలు , పోరాటాలు చేశారు.

బ్రిటిష్ పాలన నుండి భారతదేశం స్వాతంత్ర్యం పొందడానికి సమాజంలోని విస్తృత వర్గాలకు చెందిన ఎంతో మంది వ్యక్తులు, అనేక సంస్థలు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక పద్ధతుల ద్వారా అనేక మార్గాలు ఎంచుకున్నారు. కొందరు ప్రాణాలు అర్పించారు. మరి కొందరు పలుమార్లు జైలు పాలయ్యారు. ప్రత్యేకించి భారత ఉపఖండంలో వలస పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు, సత్యాగ్రహాలు, నిరాహారదీక్ష-లు, సభలు, రచనల ద్వారా రాజకీయ ప్రచారం చేసిన వ్యక్తులు ఎందరో. స్వాతంత్ర్యానంతరం ఉద్యమంలో పాల్గొన్న వారిని భారత ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది.వారికి "స్వాతంత్ర్య సమరయోధుడు" అని వారికి టైటిల్ ఇచ్చింది. ఈ కేటగిరిలో వ్యక్తులు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు ఉంటారు కదా! వారు స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ లు, ఇతర ప్రయోజనాలు పొందారు.

భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో స్త్రీలు సైతం జైళ్ల పాలవ్వడమే కాక, జైళ్లల్లో పిల్లలకు జన్మనిచ్చిన తల్లులు కూడా ఉన్నారు. ఆస్తులు, బంగారాలు సైతం అమ్మి, దేశం కోసం రక్తం చిందించి, ప్రాణాలర్పించిన వారు సుమారుగా ఆరు లక్షలకు పైగా స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నారు. అనధికా-రికంగా ఎంతో మంది ఉన్నారు. బ్రిటిష్ వారి బానిస సంకెళ్ళ నుంచి విముక్తి చేసేందుకు వారినందరినీ ఒక తాటిపై తెచ్చింది మువ్వన్నెల జెండా. స్వాతంత్ర సమరయోధుడు పింగళి వెంకయ్య గారు "జాతీయ జెండా" రూపకర్త. 1921 లో మహాత్మా గాంధీ సూచనలతో జాతీయ జెండాను రూపొందించారు. అలాంటి జెండా ఆవిష్కరణ వెనుక ఎన్నో ఆసక్తికర అంశాలు ఉన్నాయి. మూడు రంగుల ఏర్పాటు నుంచి మధ్యలో "అశోకుని చక్రం" ముద్రణ వరకు ఎన్నో విశేషాలు దాగి ఉన్నాయి. దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని ప్రతిబింబింప జేసే ఆ జెండాకు ప్రాణం పోసింది మన తెలుగువాడే.

1857 లో జరిగిన తొలి స్వాతంత్ర పోరాటంలో ఓ ముస్లిం స్వాతంత్ర సమరయోధుడు మొదటిసారి "భారత్ మాతాకీ జై" అని నినాదం ఇచ్చినట్లు చరిత్రకారుల బృందం తెలుపుతోంది.

ఇంత కష్టపడి తెచ్చుకున్న స్వాతంత్ర్యాన్ని మనం ఈ రోజు హాయిగా అనుభవిస్తూ, సుఖంగా జీవించ-గలుగుతున్నామంటే, ఆ కష్టం ఆ స్వాతంత్ర్య సమర యోధులదే. ఈ స్వాతంత్ర్యాన్ని మనం ఈ ప్రజాస్వా-మ్యంలో ఎంతవరకు సద్వినియోగం చేసుకుంటున్నామో! ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో మనం ఉన్నాం. తమ జీవితాలను పణంగా పెట్టిన మన సమర యోధుల ఆత్మకు శాంతి కలగాలంటే మనం ఆగస్టు 15న వారినందరిని గుర్తు చేసుకుంటూ, మనం అందరం ఒక సంకల్పం తీసుకోవాలి.

మన భారతీయుల కున్న మేధో సంపత్తిని వాడుకుంటూ, ఉత్కృష్టమైన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ, మహనీయులకు పేరు పేరునా వారి స్మృతికి నివాళులు అర్పించాలి. భారత దేశ వా-రసత్వ సంపదను కాపాడుకుంటూ, బలమైన ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందడమే కాక , ప్రపం-చంలోనే బలమైన సైనిక శక్తిగా ఎదగాలని మన స్వాతంత్ర సమర యోధులంతా కోరుకున్నారు. సైనిక పరంగా బలమైన దేశంగా ఆపరేషన్ సింధూర్ ద్వారా మన దేశం చెప్పడం జరిగింది. ఉగ్రవాద శిబిరా-లను అత్యంత చాకచక్యంగా ధ్వంసం చేసింది మన దేశం. ప్రతి భారతీయుడి గుండెల్లో ఆత్మ గౌరవాన్ని నింపింది.

ఇప్పుడు కూడా మనం అందరం మన కుటుంబాలతో సుఖంగా ఉండగలుగుతున్నామంటే, మన సైనికుల త్యాగాల ఫలితమే. వారి కృషి, సైనికుల కుటుంబాల త్యాగం మనమందరం నిరంతరం గుర్తుం-

చుకోవాలి. వారి కష్టం అనిర్వచనీయం. ఆ కుటుంబాలకు మనమందరం ఎప్పటికీ ఋణపడి ఉం-టామనేది నిర్వివాదాంశం . అయితే స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు పూర్తి కావస్తున్నా, ఇప్పుడు అమెరికన్ సామ్రాజ్యం ఇండియాను తన ఆదేశాలకు తలొగ్గమని హుకుం జారీ చేస్తోంది. ఐతే సామ్రాజ్యవాదానికి ఇదేమీ కొత్త కాదు, గత 78 ఏళ్లుగా చాలా సందర్భాలలో అమెరికన్ సామ్రాజ్యవాదం ఇండియాను తన ఆదేశాలకు లోబడి నడుచుకోవాలని బెదిరించింది ఇదివరకు బెదిరింపులకు, ఇప్పటి బెదిరింపులకు తేడా ఉంది. మా ప్రయోజనాల కోసం నువ్వు నడుచుకోకపోతే నిన్ను శిక్షిస్తాం అన్న విధంగా అమెరికా ఇప్పుడు బెదిరిస్తోంది. ఇప్పుడు మాత్రం అమెరికా బెదిరింపులకు ఇండియా నుండి మిశ్రమ స్పందనలు వస్తున్నాయి, 1950 తరువాత డల్లస్ మరణానంతరం క్రమంగా అమెరికా ఇండియా పట్ల తన వైఖరిని మార్చుకోసాగింది. ఇండియాను దూరం పెట్టడం వలన ఇండియాకు కలిగిన నష్టం ఏమీ ఉండకపోగా రష్యాకు అనుకూలంగా మారుతోందని గ్రహించింది. బంగ్లాదేశ్ యుద్ధ సమయంలో ఇండియా జోక్యం చేసుకోవడం వలన అక్కడ కూడా అమెరికాకు ఇండియాను దెబ్బ కొట్టడానికి లేకుండా పోయింది. తన ఆధిపత్యాన్ని సాధించడం కోసం అమెరికా ఎప్పటికప్పుడు వ్యూహాలు పన్నుతూనే ఉంది. కానీ అమెరికా బెదిరింపులకు ఇండియా గతంలో తిప్పికొట్టగల్గింది. కానీ ఇప్పుడు ఉదారంగా వ్యవహరిస్తోంది అని కొందరు విశ్లేషకులు భావన.

ఇప్పుడు ట్రంప్ ప్రదర్శనలు ఒక్క ఇండియాకే పరిమితం కాదు. రెండు రకాల సుంకాలను విధిస్తున్నాడు. ఆగస్టు 1 నాటికి సుంకాలను పెంచడం విషయంలో ఏదీ ఒప్పందం కుదరలేదు. కాబట్టి అమెరికన్ మార్కెట్లో ఇండియా ఎగుమతుల మీద 25 శాతం అదనపు సుంకము విధిస్తారు. రెండోది .. పెనాల్టీ సుంకాలు. రష్యా మీద పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలను ఉల్లంఘించి ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు గాను శిక్షగా అపరాధపు సుంకం విధిస్తారు. ఇది కాకుండా బ్రిక్స్ కూటమి గురించి ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు చూస్తే, ఇండియా ఆ కూటమి నుంచి బైటకు రావలసి వస్తుంది లేదా ఆ కూటమిలోనే కొనసాగుతూ, అమెరికన్ ప్రయోజనాలను నెరవేర్చేలా ఆ కూటమికి వెన్నుపోటు దారుడు గా నడుచుకోవాల్సి వస్తుంది. బ్రెజిల్ ఉత్పత్తుల మీద అమెరికా 50 శాతం సుంకాలు విధిస్తే, బ్రెజిల్ కూడా అమెరికన్ ప్రభుత్వం మీద 50 శాతం సుంకాలు విధిస్తామంటూ బ్రెజిల్ అధ్యక్షుడు లులా ప్రకటించాడు.

మర్యాదగా తాము చెప్పినట్లు నడుచుకుంటే సరి, లేకపోతె మీ సంగతిచేస్తానన్న బెదిరింపు ధోరణిలో అమెరికా వ్యవహారం నడుస్తోంది. ఓ పక్క సుంకాలు ,ఐటీ ఉద్యోగులకు, వీసాలకు, అలాగే ఎక్కడికక్కడ బెదిరింపులు నడుస్తున్నాయి. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం ధైర్యంగా ఎదుర్కోవాలని ప్రజల, విశ్లేషకుల అభిప్రాయం.

మన మేధా సంపత్తిని, మనం ఉపయోగించుకోవాలని, మన దేశాన్ని మనం అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని ప్రజల ఆకాంక్ష. గొప్ప కుటుంబ వ్యవస్థ, 150 కోట్లు జనాభా ఉన్న మన దేశం మనమం-దరం కుల మత ద్వేషాలు మాని, అందరం ఉన్న మన దేశం అభివృద్ధి చేసుకోవడానికి ఇదే ఒక మంచి అవకాశంగా మలచుకోవాలని చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది. అందరూ కుల మత ద్వేషాలను విడనాడి, 79 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకుందామా!



సర్వేజనా సుఖినోభవంతు

తీగవరపు శాంతి

# స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రసంగం

**స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో భారతదేశ వృద్ధి, రక్షణ మరియు ప్రజాస్వామ్యాన్ని రాష్ట్రపతి ప్రశంసించారు; ఉగ్రవాదాన్ని ఖండించారు, సాయుధ దళాలను మరియు జాతీయ పురోగతిని ప్రశంసించారు.**



భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశాధ్యక్షురాలు ద్రౌపది ముర్ము జాతిని ఉద్దేశించి ప్రసంగించారు, దేశం యొక్క స్థితిస్థాపకత, వృద్ధి మరియు అభివృద్ధి చెందుతున్న ప్రపంచ స్థాయిని హైలైట్ చేశారు. భారతదేశం విభిన్న సవాళ్లను అధిగమించి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదగడం పట్ల ఆమె ప్రశంసలు కురిపించారు, 6.5% GDP వృద్ధిని మరియు బలమైన ఆర్థిక ఊపుకు సూచికలుగా పెరుగుతున్న ఎగుమతులను ఆమె గుర్తించారు. భారతదేశం పురాతన గణతంత్ర రాజ్యం మరియు ప్రజాస్వామ్య తల్లిగా అభివర్ణిస్తూ, రక్షణ మరియు ఆరోగ్య సంరక్షణ నుండి సాంకేతికత మరియు అంతరిక్షం వరకు కీలక రంగాలలో పురోగతిని ఆమె నొక్కిచెప్పారు. కాశ్మీర్ లోయలో రైలు లింక్ ప్రారంభోత్సవాన్ని ప్రస్తావిస్తూ, వాణిజ్యం మరియు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే, ఈ ప్రాంతానికి కొత్త ఆర్థిక అవకాశాలను తెరిచే ఒక ప్రధాన మైలురాయిగా ఆమె అభివర్ణించారు. ఆయుష్మాన్ భారత్‌ను గేమ్-ఛేంజింగ్ హెల్త్‌కేర్ ఇనిషియేటివ్‌గా ఆమె పేర్కొన్నారు మరియు 2047 నాటికి ప్రపంచ AI హబ్‌గా మారాలనే భారతదేశం యొక్క ఆకాంక్షను ధృవీకరించారు, ప్రజా ప్రయోజనం కోసం సాంకేతికతను ఉపయోగించడంపై దృష్టి సారించారు. శుభాంషు శుక్లా అంతరిక్ష యాత్రను, క్రీడల్లో యువత సాధించిన విజయాలను ప్రశంసిస్తూ, భారతదేశ యువతరం ఆశయాన్ని, జాతీయ గర్వాన్ని పునర్నిర్వచించుకుంటోందని రాష్ట్రపతి అన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ఆమె సాయుధ దళాలను మరియు 'ఆపరేషన్ సిందూర్'ను ప్రశంసించారు, ఇది రక్షణలో ఆత్మనిర్భర్ భారత్‌లో ఒక మైలురాయి అని అభివర్ణించారు. సాయుధ దళాలు, పోలీసులు, న్యాయవ్యవస్థ మరియు భారతీయ ప్రవాసులకు వందనం చేస్తూ, ప్రతి పౌరుడికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్రపతి ప్రసంగించారు.

# స్వాతంత్ర్యం _ అంతరంగం

రమ ద్రోణంరాజు

ఆగస్టు నెలలో అడుగు పెట్టగానే మనకు మొట్టమొదట గుర్తుకు వచ్చేది జెండా పండుగ. అదే "స్వా-తంత్ర్య దినోత్సవం". పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నగర ప్రముఖులచేత జెండాను ఆవిష్కరింపచేసి, సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకుంటాము. దేశ భక్తి గీతాలను పాడి దేశంకోసం బలిదానం చేసిన అమరవీరులను తలచుకుంటూ, వారి గాథలను స్మరించుకుంటూ, వారి త్యాగనిరతికి ధన్యవాదాలు తెలియచేస్తూ, "దేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకుంటాం" అని ప్రతిజ్ఞ చేస్తాం.

ఆ రోజు పాఠశాలల్లో విద్యార్థులకు మిఠాయిలు పంచుతారు. కార్యాలయాల్లో విందులు ఏర్పాటు చేసు-కుంటారు.

ఊరంతా దేశభక్తి గీతాలతో సరికొత్త జెండాలతో, రంగు రంగుల కాగితాలతో అలంకరించి, పెళ్ళి కళతో నిండిన నగరాన్ని చూసి మన మనసు ఉల్లాసంతో, ఉత్సాహంతో నిండిపోతుంది.

అందులో భాగంగా మనం ఈ సంవత్సరం 79 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ ఇక్కడిదాకా చేరాం. సినీ గానకోకిల లతా మంగేష్కర్ గారి పాట ఈ సందర్భా-లలో గుర్తు చేసుకుందాము.

" ఏ మేరే వతన్ కే లోగో, జర ఆంఖ్ మే భర్ లో పానీ, జో షహీద్ హుఏ హై ఉన్కీ జరా యాద్ కరో కుర్బానీ". అంటే "ఆ అమర వీరులను తలచుకొని కాస్త కంట తడి పెట్టండి" అని అర్థం. ప్రకృతి ప్రసాదిం-చిన దాన్ని ప్రసాదంగా స్వీకరించే గుణం భారతీయుడిది. తన స్వార్ధ ప్రయోజనాల కోసం వాడుకుందామనే ఆలోచన ఒక భారతీయుడికి రాకపోవడం ఈ గడ్డమీద పుట్టినందుకు అబ్బిన సంస్కారం. వలస వచ్చిన వారు దాన్ని అలుసుగా తీసుకున్నారు.

చరిత్రలో నిలిచిపోయిన కథలు మనకు చెబుతున్నాయికదా!

గౌతమ బుద్ధుడు రాజ్యాన్ని వదిలి వెళ్ళిపోయాడు. ముందు తన అంతరంగంతో యుద్ధం చేశాడు. అందుకు తపస్సు చేశాడు. ప్రతిఫలంగా శాంతి దూతగా మారి ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించాడు. "అహింసా పరమో ధర్మః"
అని చాటిచెప్పాడు.

అశోకుడు ఏమయ్యాడు? "సామ్రాట్ అశోక్" అవ్వాలనే ఆశయంతో ఖండాలుగా ఉన్న రాజ్యాలను ఏకం చేయగలిగాడు. కాని
అంతరంగంతో చిత్తుగా ఓడిపోయాడు. చివరకు బౌద్ధాన్ని స్వీకరించి శాంతి మార్గాన్ని ప్రపంచానికి అందించాడు.

ప్రపంచ విజేత అలెగ్జాండర్ ఏమయ్యాడు? ప్రపంచాన్ని గెలిచే ప్రయత్నంలో భారతదేశం వరకూ వచ్చాడు. ఇక్కడి ప్రజల నడవడికకు ప్రభావితం అయి, అస్త్రాలను వదిలిపెట్టి, ఆత్మ జ్ఞానాన్ని పొంది, తను మరణించాక శవ పేటికలో తన రెండు చేతులను బయట కనిపించేవిధంగా ఉంచమని సైనికులను ఆదేశించాడు. దానర్థం "మనం వచ్చేది వట్టి చేతులతోనే, పోయేది వట్టిచేతులతోనే" అని.
అందుకే "హద్దులు నిర్మించేది బయట కాదు, మన అంతరంగంలో. యుద్ధం జరగాల్సినది బయట కాదు, మన లోపల" అని చెబుతుంది మన భారతావని!

ఈ సందర్భంలో నాకు "గురు నానక్ దేవ్" దేశానికి అందించిన సేవ గుర్తుకు వస్తుంది. ఆయన సిక్కు

మతాన్ని స్థాపించాడు. అంటే "నేర్చుకో" అని అర్థం. నిజానికి అది ఒక మతం కాదు. మొఘలుల నుండి
రక్షింప బడటానికి తయారుచేసుకున్న నియమాలని చెప్పవచ్చు.
ముఖ్యంగా ఆయన వారి శిష్యులకు నేర్పినది; ఆడవారితో సహా ఆయుధాలు పట్టుకోవడం. శ్రమ శక్తిని నమ్మడం. ఆకలి అన్న వానికి అన్నదానం చేయడం.

మహాకవి గురజాడ "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్",
"దేశమును ప్రేమించుమన్నా,
మంచి అన్నది పెంచుమన్నా" అని దేశభక్తిని చాటిచెప్పాడు.

1857 లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన వీర నారి ఝాన్సీ లక్ష్మీబాయి. ఆమె ఆకస్మిక వీర మరణంతో ఆమె చేపట్టిన స్వాతంత్ర్య సంగ్రామం ఒక శతాబ్ద కాలం వెనక్కి నెట్టబడింది. ఆమె చేతుల మీదిగా మనం స్వాతంత్ర్యం పొంది ఉంటే ఆ కథ వేరుగా ఉండేది. ఒక భారత స్త్రీ సామర్థ్యమేమిటో తెలిసేది. ఒక స్త్రీ చేతిలో చిత్తుగా ఓడిన బ్రిటీష్ సామ్రాజ్యమని చరిత్ర పుటల్లో లిఖించబడేది. కానీ అగ్ని జ్వాలను అగ్నితో ఆర్పటం సాధ్యం కాదు కదా. దానికి నీరు అవసరం. అందుకేనేమో ప్రకృతి "అహింసాపరమో ధర్మః" అనే ఉపనిషత్ వాక్యాన్ని ఆచరణలో పెట్టి, బోధించమని "శాంతిదూత" ను పంపింది. యుద్ధం ఆగ వలసిందే. స్వాతంత్ర్యం


## చైతన్యం సంకల్పబలం ప్రకటన

మన దేశంలో ఉమ్మడి కుటుంబాల నేపథ్యంతో , అలాగే పల్లెటూళ్లలో అయితే పూర్వం అగ్రహారాలు ఉండేవి . ఈ రోజుల్లో కొందరు దగ్గర బంధువులు కలిసి ఒకే చోట ఇళ్లు కట్టుకుని ఉండడం , లేదా దగ్గర కుటుంబాల వారంతా దగ్గర దగ్గరగా ఒకే చోట flats తీసుకుని అందరూ కలుస్తూ ఉండడం జరుగుతోంది . అందరూ కలిసి మెలిసి ఎంతో ఆనందంగా గడుపుతూ , గత స్మృతులను ( sweet memories) తల్చుకుంటూ ఉంటాం. మీ అనుభూతులను చైతన్యం సంకల్పబలం పత్రికలో పంచుకోవాలనుకుంటున్నారా ? ఇంకెందుకు ఆలస్యం? teega 51@gmail. కం కి గాని , 9490571297 కి గాని, 9490581297 కి గాని పంపగలరు.... ఎడిటర్.



## చైతన్యం సంకల్పబలం ప్రకటన

సెప్టెంబర్ 5 వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మీరు మీ గురువుల గురించి ఏమైనా చెప్పాలనుకుంటున్నారా ? అలాగే మీకు నచ్చిన , మీకు గుర్తుండిపోయే గురువుల గురించి చెప్పాలనుకుంటున్నారా ? అలాగే గురువు లేదా ఉపాధ్యాయుడు అంటే ఎలా ఉండాలనుకుంటున్నారు ? మీరు పంచుకోవాలనుకుంటున్న విషయాలను చైతన్యం సంకల్పబలం పత్రికకు వ్రాసి , లేదా వీడియో చేసి కానీ పంపితే సెప్టెంబర్ నెలలో ప్రచురిస్తాం.ప్రింట్ లో 3 పేజీలకు మించ కుండా పంపవలసి ఉంటుంది . పంపవలసిన ఆఖరు తేదీ ఆగస్టు 20 వతేదీ. ... ఎడిటర్ .

# ఆస్ట్రోనాట్ కు అభినందనల వెల్లువ

శుభప్రదంగా భూమికి తిరిగొచ్చిన శుభాంశు శుక్లా - మరో ముగ్గురు వ్యోమగాములు

గత నెల 25న నింగిలోకి దూసుకెళ్లిన శుభాంశు శుక్లా,జూలై 15న ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ కు గుడ్ బై చెప్పి, రెండవ భారత వ్యోమగామి గా క్షేమంగా భూమికి తిరిగొచ్చారు.

ఈ శుభాంశు శుక్లా గురించిన వివరాలు తెలుసుకుందాం.

ప్రతి రోజూ సూర్యోదయానికి ముందే ఆకాశం కేసి చూస్తూ, చంద్రుడిని, నక్షత్రాలను, అలాగే కాస్సేపయ్యాకసూర్యుడిని చూస్తూ ముక్కోటి దేవతలను త్రిమూర్తులను, ముఖ్యంగా ఆంజనేయ స్వామిని ఆరాధిస్తూ, అంజనాదేవి మాతా ... ఇంత వీరాధి వీరుడైన పుత్రుడిని కన్న తల్లీ ఎంత అదృష్టవంతురాలివమ్మా! అంటూ ప్రార్థించేది ఆశా శుక్లా. ఆమె భక్తికి మెచ్చిన ఆంజనేయుడు

ఆశా శుక్లాకి తానే ప్రతిరూపమై, ఆశా శుక్లాకి పుత్రుడిగా శుభాంశు శుక్ల 1985 ,అక్టోబర్ 10 న జన్మించాడు. శుభాంశు శుక్లా లక్నో లో పుట్టారు. ఆయన తండ్రి శంభు దయాల్ శుక్లా. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి. అతనికి ముగ్గురు సంతానం. శుభాంశు మూడవ సంతానం. అతను సిటీ మాంటిస్సోరి స్కూల్ లో చదువుకున్నాడు. 1999 కార్గిల్ యుద్ధం స్ఫూర్తితో నేషనల్ డిఫెన్స్ అకాడమీ , నేవల్ అకాడమీ పరీక్షలు వ్రాసి, విజయం సాధించారు. అలాగే 2005 లో ఎన్డీయే నుంచి కంప్యూటర్ సైన్స్ లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ లో ఫ్లయింగ్ ట్రైనింగ్ కు ఎంపికయ్యారు. శుభాంశు భార్య పేరు కామ్నా శుక్లా. ఆమె దంత వైద్యురాలు. వారు చిన్నప్పటి నుండి క్లాస్ మేట్స్ . అతనికి కియాష్ అనే ఆరేళ్ళ బాబు ఉన్నాడు.



శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర గురించి తెలుసుకుందాం :

భారత రోదసి చరిత్రలో కీలక అంశం దిగ్విజయంగా పూర్తి చేసి, దిగ్విజయంగా తిరిగొచ్చారు. స్వీయ మానవ చరిత్రలో అంతరిక్ష యాత్ర 'గగన్ యాన్' కు మార్గం సుగమమైంది. భూమికి 400 ల కిలోమీటర్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 18 రోజుల పాటు గడిపిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా ... చిరునవ్వులు చిందిస్తూ భూమికి చేరుకున్నారు. 41 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత, భారతీయ పౌరుడు రోదసీ యాత్రను పూర్తి చేసుకుని, సగర్వంగా తిరిగొచ్చిన అద్భుత ఘట్టాన్ని వీక్షించి యావద్దేశం పులకించిపోయింది. గగన యాత్రికుడికి ఘన స్వాగతం పలికింది. నింగినుంచి భూమికి వచ్చిన కుమారుడిని టీవీ లో చూసిన తల్లిదండ్రులు, సహోదరి , భావోద్వేగానికి లోనయ్యి, తరువాత ఆనందంతో పులకించిపోయారు.

యాక్సియాం -- 4 మిషన్ లో పైలట్ గా శుక్లా పాత్రను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. దేశ అంతరిక్ష పరిశోధనల్లో, అంతర్జాతీయ భాగస్వామ్యుల్లో ఒక కొత్త మైలు రాయిని ఆయన స్థాపించారని చెప్పారు. చారిత్రక

యాత్ర ముగించుకుని వచ్చిన శుభాంశు కు దేశ ప్రజలందరితో కలిసి స్వాగతం పలుకుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఆయన తన అంకిత భావం, ధైర్యం, మార్గదర్శకత్వంతో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి-ని రగిలించారని కొనియాడారు. గగన్ యాన్ యాత్ర దిశగా ఇదో ముఖ్య మైలు రాయి అని పే-ర్కొన్నారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్, హోమ్ మంత్రి అమిత్ షా, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు రాజకీయ నేతలు శుక్లా కు అభినందనలు తెలిపారు.

జూలై 15వ తేదీన అమెరికాలో-ని కాలిఫోర్నియాలో నింగి నుండి ముందుగా సముద్రంలో దిగి, భూమి మీదకు రావడం జరిగింది. 16 వ తేదీన ఫామిలీ ని కలవడం జరిగింది. 17వ తేదీ మధ్యాహ్నం గంటల 12. 15 నిమిషాలకు మన చైతన్యం సంకల్పబలం శుక్లాను కలవడం జరిగింది. ఆయనను కలిసినప్పుడు మన కుటుంబ వ్యక్తిగా ఇంకా చెప్పాలంటే నా వయస్సుకు మా అబ్బాయి లాగా అనిపించారు. అంత నెమ్మదిగా అంటే down to earth ఉన్నారు. ఎప్పటి నుండో తెలిసిన వ్యక్తి లాగ కలిసి పోయారు. మేము కలిసి, కొద్దిగా మాట్లాడాము.

ఆ తరువాత 18 వ తేదీన AFMC కాలేజ్ గాదరింగ్ AF MC పూనాలో చదివిన డాక్టర్స్ అమెరికా హ్యూస్టన్ లో శుభాంశు శుక్లా ఫ్యామిలీ కి గ్రాండ్ వెల్ కమ్ ఏర్పాటు చేశారు. జీరో గ్రావిటీ లో గడపటం వల్ల వ్యోమగాములు, భూమికి తిరిగివచ్చిన వ్యోమ-గాములు కొంత సమయం 'రి హ్యాబ్' లో గడపవలసి వస్తుంది. AFMC లో చదివి, ప్రస్తుతం బెంగళూరు ఎయిర్ ఫోర్స్ లో హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ మెడిసిన్ గా పని చేస్తున్న Dr. పుణ్య శ్లోక్, శుభాంశు శుక్లా 'రి హ్యాబ్'ను పర్యవేక్షించేందుకు ఇండియా నుంచి హ్యూస్టన్ కి వచ్చారు. వారిని కూడా ఈ గెట్ టుగెదర్ కు ఆహ్వానించారు.

అక్కడ డిన్నర్ తరువాత శుభాంశు శుక్లా, స్పేస్ సెంటర్ గురించి, అక్కడ ఆయన పొందిన అను-భూతితో పాటు అనేక విషయా-లను చెప్పారు. అలాగే అక్కడ డాక్టర్స్ అడిగిన రకరకాల ప్ర-శ్నలకు ఎంతో చక్కగా సమా-ధానాలు చెప్పారు. అలాగే శుక్లా భార్య కామ్నా కూడా మాట్లాడ-గా, ఆమెను కూడా కొన్ని ప్రశ్నలు అడిగారు. ఆమె కూడా ఎంతో బాగా సమాధానాలు చెప్పారు.

ఇక శుక్లా పయనం ఏ విధంగా జరిగింది? డాక్టర్స్ గాదరింగ్ లో జరిగిన విశేషాల గురించి తెలు-సుకుందామా!

శుక్లా ఊరు, భార్య ఊరు కూడా యూపీ లోని లక్నో.

శుక్లా మిషన్ పైలెట్. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో పైలెట్ గా పని చేసాడు. ఎయిర్ క్రాఫ్ట్, సాఫ్ట్ వేర్, అందులో రిపేర్లు అన్నీ శుభాంశు శుక్లా చూసుకున్నాడు. 2020 నుంచి ఇలా స్పేస్ లోకి వెళ్ళడా-నికి ట్రైనింగ్ మొదలు పెట్టాడు. మొత్తం 4 గురు వెళ్లారు. ఇక డాక్ట-ర్స్ అడిగిన ప్రశ్నలు ఇలా ఉన్నాయి ... మీరు సెలెక్ట్ అయ్యారు అనే విషయం ఎప్పుడు తెలిసింది? అని అడిగారు .. నాలుగు రోజుల ముందే ఫోన్ వచ్చింది.

పై నుంచి భూమి ఎలా అనిపిం-చింది? మీకు, అని అడిగిన ప్ర-శ్నకు సమాధానంగా భూమి చాల అందంగా అనిపించింది.

భూమి చుట్టూ ఎన్ని సార్లు తిరిగి ఉంటారు? అన్న ప్రశ్నకు రోజుకి 15, 16 సార్లు తిరిగి ఉంటాను అని చెప్పారు.

సన్ రైజ్ సన్ సెట్ అక్కడ నుంచి ఎలా అనిపించింది? అంటే చాలా అందంగా అనిపించింది.

మీ నిద్ర గురించి చెప్పండి .. మీరు ఎంత సేపు పడుకునే వారు? ఎలా పడుకునే వారు? అన్న ప్రశ్నకు రోజుకు 6,7 గంటలు పడుకునే వాడిని అన్నారు. గ్రావిటీ ఉండదు కదా .. నుంచుని పడుకుంటారు. గాలిలో తేలడం వల్ల ఏమీ అని-పించదు అన్నారు.

స్పేస్ స్టేషన్ లోపల ఏమీ తెలియదు, మామూలుగానే ఉంటుంది అన్నారు.

ఫుడ్ ఏమి తినేవారు? అన్న ప్రశ్న-కు పాకెట్స్ లోపల ఫుడ్ తింటారు సహజంగా అని చెప్పారు .

ఫుడ్ ఏమైనా మీరు ఇంటి నుంచి తీసుకు వెళ్ళారా? అని అడిగిన ప్రశ్నకు ఆమ్ రస్, గాజర్ హల్వా, మూంగ్ దాల్ హల్వా తీసుకుని వెళ్ళాను అన్నారు.

అక్కడ నుంచి ఇండియా ఎలా అనిపించింది? అన్న ప్రశ్న-కు ఇండియా చాలా అందంగా అనిపించింది. మూడు వైపులా

సముద్రం, పైన కొండలు చాలా అందంగా అనిపించింది. మనం చిన్నప్పుడు స్కూల్ లో చదువుతాం కదా! వదిలేశాక తల్చుకుంటే ఆ స్కూల్ చాలా గొప్పగా అనిపిస్తుంది. తరువాత మన ఊరు వదిలేశాక గొప్పగా అనిపిస్తుంది. అలాగే మన దేశం వదిలేసి, విదేశాలకు వెళ్ళినప్పుడు మన దేశం, అలాగే స్పేస్ సెంటర్ నుంచి చూస్తే, భూమి అంతా ఒక్కటే అని, తేడా ఏమీ లేదని, భూమి అంతా చాలా అందంగా ఉందని శుక్లా అన్నారు. అయినా స్పేస్ సెంటర్ నుంచి భూమి చూస్తున్నపుడు, ఒక్కసారి సముద్రం దాటి త్రిభుజాకారంలో లో ఉన్న మన భారత్ ద్వీపకల్పం కనిపించేసరికి, మన దేశం ఎంతో అందంగా కనిపించిందని, మన దేశం కాబట్టి అలా అనిపించటం కాదని, నిజంగా భారత్ ఎంతో ప్రత్యేకంగా ఉందని చెప్పారు.

అక్కడ ఒక ఎక్స్పరిమెంట్ చేశాం. అక్కడ గ్రావిటీ లేకపోవడం వల్ల బోన్స్ వీక్ అవుతాయి. సప్లిమెంట్స్ వాడి అంటే కాల్షియం లాంటివి వాడి వాటిపై ఎక్స్పెరిమెంట్ చేసి చూసాం. అప్పుడు బోన్స్ వీక్ అవ్వలేదు.

ఈ రోజుల్లో పిల్లలను ఎలా పెంచాలి? మీ బాబును ఏమి చేయాలనుకుంటున్నారు? అనే ప్రశ్నకు సమాధానంగా శుభాంశు... వాళ్ళ క్యారెక్టర్ బిల్డ్ చేస్తే చాలు. అది చాలా ఇంపార్టెంట్ అన్నాడు. వాళ్ళు ఒక గోల్ పెట్టుకుని రీచ్ అవ్వడానికి ప్రయత్నించాలి




అన్నారు.

శుభాంశు శుక్లా భార్య పేరు కామ్నా. ఆవిడ డెంటిస్ట్. ఇద్దరి ఊరు లక్నో. ఇద్దరూ 3వ క్లాస్ నుండి కలిసి చదువుకున్నారు. చిన్నప్పటి నుండి మీరు ప్రేమించుకున్నారా? అన్న ప్రశ్నకు ... లేదు అప్పటి నుంచి ఏమీ తెలియదు. రాను రాను అనిపించింది అని కామ్నా చెప్పడం జరిగింది. శుక్లా ఎలా ఉండే వారు? అన్న ప్రశ్నకు కొంచెం పైగా ఉండేవారు. కానీ చాలా పట్టుదల, ధైర్యంగా ఉండేవారు అని కామ్నా చెప్పారు. వారికి ఒక 6 సంవత్సరాల బాబు ఉన్నాడు. శుభాంశు శుక్లా వెడుతున్నప్పుడు మీకేమనిపించింది? అని కామ్నా ను అడుగగా, సమాధానంగా ఆల్రెడీ ఫైటర్ పైలెట్ కదా! జెట్ విమానాలు అన్నీ నడుపుతూ ఉండేవారు కదా! అందుకని నాకు భయం అనిపించలేదు. అలాగే ఒక్కసారి పైకి వెడుతున్నప్పుడు చూస్తుంటే, మీకు భయమేయ్యలేదా? అన్న ప్రశ్నకు సమాధానంగా పైకి ఒక్కసారి వెడుతున్నప్పుడు, నేను ఉండను అక్కడ. చూడను అని శుభాంశు శుక్లా భార్య కామ్నా అన్నారు.

సునీతా విలియమ్స్ అక్కడ చిక్కుకు పోయారు కదా! మీకు టెన్షన్ అనిపించలేదా? అని మా హస్బెండ్ శుక్లాను అడగగా, సమాధానంగా శుక్లా ఇలా అన్నారు. మెంటల్ గా ప్రిపేర్ అవుతాం కదా! ఏమీ అనిపించదు అని అన్నారు.

కొస మెరుపు .... శుభాంశు శుక్లా భార్యను చూసిన లేడీ డాక్టర్స్ అంతా ... కామ్నా ఎంత అదృష్టవంతురాలు! శుక్లా ఎంతో డౌన్ టు ఎర్త్ ఉన్నారు అనుకున్నారు.

మన ప్రభుత్వం ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ కి ISRO (ఇండియాన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) Axiom-4 మిషన్ కి సుమారుగా రూ 550 కోట్లు (సుమారు $ 65 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది.

ఇక ముందు ఏమి చేయ బోతున్నారు? అన్న ప్రశ్నకు ఇప్పుడు మన భారత దేశం గగన్ యాన్ పై దృష్టి పెట్టి, చంద్రునిపై కాలు మోపడానికి ప్రయత్నాలు జరుపుతుంది అని శుక్లా అన్నారు.

మీరు ఇండియా ఎప్పుడు వెడుతున్నారు? అన్న ప్రశ్నకు ఆగస్టులో వెడుతున్నట్లు చెప్పారు. అమెరికాలోని హ్యూస్టన్ నగరంలో క్యారంటైన్ లో ఉన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని, మన భారతీయులు గగన్ యాన్ పై మరిన్ని తెలుసుకుని సురక్షితంగా రావాలని కోరుకుందామా!

సర్వేజనా సుఖినోభవంతు!

# శుక్ల పక్షం



డా.వోలేటి.పార్వతీశం

అందనంత ఎత్తులో
నిలకడ లేని గమ్యం
విశ్రాంతి అన్న మాటకు
అర్థం తెలిసినట్టు లేదు
విరామ మెరుగని పయనం సాగిస్తూ ఉన్నది
అంతరిక్ష
పరిశోధనాలయం
బహుశః
ఊరిస్తున్నది కాబోలు
ఒక్క ఉదుటన ఉరికేందుకు
వ్యోమ గమన నాళిక సంసిద్ధమౌతోంది
గురుత్వాకర్షణ వలయాలు ఛేదించుకొని
నింగి అంచులు దాటి
దీర్ఘ ప్రయాణం
వియత్తలాన అదొక సాహసం
నేల విడిచి సాము చేసే ప్రయత్నం
నభో మండలానికి ఆవల
గమిస్తున్న పరిశోధనల వాహిక
అనుగమిస్తున్న అంతరిక్ష నౌక
శాస్త్రజ్ఞుల మేధోబలానికి ఋజువుగా
అద్భుతమనిపించే రెండింటి చేరిక
పరుగులు తీస్తున్న ఆమె
వెంటపడుతున్న అతడు
ముందరున్న చిన్నదాని
చేయి అందుకున్నట్టు
ఆపైన హృదయానికి హత్తుకున్నట్టు
అవి యంత్రాలు సరే
మంత్రాలు, మంగళ ధ్వనులు కూడా లేవు సరే
దృశ్యం అయితే ఇదే కదా
కవిత్వానికి ఏమి తీసిపోయినట్టు
చరిస్తున్న శోధనల పరావలయ మందిరాన్ని
రోదసికి ఎగసిన ఆ వాహనం
అంతరిక్షం సాక్షిగా
ఆలింగనం చేసుకుంది
అప్పుడు పుట్టింది
అపురూప క్రియా వాచకం
డాకింగ్
మనుషులు కావు మరలు
ఔను అదొక మేటింగ్
సమాగమం
మనుషుల్ని గాలిలో తేలుస్తుంది
నేల మీద అయితేను
కానీ, ఇక్కడో
మనుషులే గాలిలో తేలుతుంటారు
నిలకడ లేని దేహాలతో
నిలువనిచ్చే నీడల కోసమని
ప్రణాళికల కల్పనలు
అందుకోసం
శోధనలు, సాధనలూనూ
యామినీ కుహరంలో
నలుగురూ ఒక్కటై / వెన్నెలవిత్తులు నాటుతున్నారు
సౌర చక్రాల వలయాల మధ్య
మరొక నాగరిక విశ్వానికి
అంకురారోపణ జరుగుతుంది
తథ్యం
ఇది మంగళకర సుముహూర్తం
శుభం అంటూ ఆశీరక్షతలు చల్లండి
శుభాస్తు గీతాన్ని / శుభాకాంక్షగా పలకండి
రేపటి అంతరిక్షం
ఇక శుక్లపక్షం...

# వార్తా విశేషాలు


## తల్లి పాల వారోత్సవాలు




తల్లి పాల ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలువు మేరకు తల్లి పాల వారోత్సవాలు జరుగుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిన ఒక తీర్మానం మేరకు ప్రతి ఏటా ఆగస్టు ఈ నెల 7 వ తేదీ వారంరోజులపాటు ప్రపంచ దేశాలు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. తల్లి పాల విశిష్టతను తెలియజేస్తూ కేంద్ర, ప్రభుత్వాలు ఈ వారం రోజుల పాటు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

## రెపో రేటు- 5.5 శాతం

రెపో రేటును 5.5 శాతం వద్దే ఉంచాలని నిర్ణయించినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంకు-ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ముంబైలో ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆయన ఈ రోజు పాత్రికేయులకు వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధి రేటు 6.5శాతంగా నమోదైయ్యే అవకాశం ఉందని తెలిపారు. ద్రవ్యోల్బణం తగ్గినప్పటికీ.. ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు ఇంకా తొలగలేదని అందువల్ల రెపో రేటును యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు సంజయ్ మల్హోత్రా తెలిపారు.



## జంధ్యాల పాపయ్య శాస్త్రి జయంతి



ప్రముఖ తెలుగు కవి కరుణ శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి జయంతి ఈరోజు. ఈ సందర్భంగా తెలుగు కవిత్వానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. 1912 ఆగస్టు 4వ తేదీన గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం కొమ్మూరు గ్రామంలో జన్మించిన పాపయ్య శాస్త్రి 20వ శతాబ్దంలో జనాదరణ పొందిన తెలుగు కవులలో ఒకరు. సులభ శైలిలో సమకాలీన ధోరణిలో చక్కని తెలుగు నుడికారంతో వినసొంపైన ఖండ కావ్యాలతో ఆయన రచనలు సాగేవి. కరుణ రస ప్రధానమైన అనేక కవితలు రాసి 'కరుణశ్రీ' గా సుప్రసిద్ధులయిన ఆయన 1992 జూన్లో కన్నుమూశారు.

## జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ మృతి



జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం తెలిపారు. ఆయన మరణం సామాజిక న్యాయరంగానికి తీరని లోటుగా అభివర్ణించారు. గిరిజనుల గుర్తింపుకు, జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రం కోసం సోరెన్ పోరాడారన్నారు. జార్ఖండ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా ఆయన సేవలు అందించారని, ప్రజల సంక్షేమానికి ముఖ్యంగా గిరిజన వర్గాల అభ్యున్నతికి ఇచ్చిన ప్రాధాన్యత ఎప్పటికీ గుర్తుండిపోతుందని ముర్ము పేర్కొన్నారు. సోరెన్ కుటుంబసభ్యులకు రాష్ట్రపతి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరోవైపు శిబు సోరెన్ మృతికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. సోరెన్ కుమారుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ను ప్రధాని ఫోన్ లో పరామర్శించారు. శిబు సోరెన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రధాని ఆకాంక్షించారు

# హైదరాబాద్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (NIAB)

దేశంలోని జంతు ఆరోగ్య రంగంలో కొత్త విప్లవం ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (NIAB)లో భారతదేశంలో మొట్టమొదటి అత్యాధునిక జంతు స్టెమ్



సెల్ బయోబ్యాంక్ మరియు స్టెమ్ సెల్ ప్రయోగశాలను కేంద్ర శాస్త్ర మరియు సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రారంభించారు. 'వన్ హెల్త్' విధానాన్ని ప్రోత్సహించే దిశగా ఈ చొరవ ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణించబడుతుంది. ఈ సందర్భంగా, కేంద్ర మంత్రి సంస్థలో కొత్త హాస్టల్ బ్లాక్ మరియు టైప్-IV క్వార్టర్లకు శంకుస్థాపన చేశారు. బయోటెక్నాలజీ శాఖ రూ. 19.98 కోట్ల వ్యయంతో మంజూరు చేసిన ఈ మౌలిక సదుపాయాలు పరిశోధకులు, అధ్యాపకులు మరియు సిబ్బంది నివాస మరియు విద్యా అవసరాలను తీరుస్తాయి, అలాగే ఆవిష్కరణ సంస్కృతిని ప్రోత్సహిస్తాయి. ఈ సందర్భంగా జంతు ఆరోగ్య నిర్వహణను బలోపేతం చేసే లక్ష్యంతో అభివృద్ధి చేసిన ఐదు వినూత్న పశువైద్య విశ్లేషణ పరికరాలను డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రారంభించారు. మానవులు, జంతువులు మరియు పర్యావరణం మధ్య పరస్పర సంబంధాన్ని దృష్టిలో ఉంచుకుని సమగ్ర ఆరోగ్యాన్ని నిర్ధారించడంపై దృష్టి సారించే 'వన్ హెల్త్' సూత్రాల కింద ఈ పరికరాలను రూపొందించారు. దాదాపు రూ.1.85 కోట్ల వ్యయంతో నిర్మించబడిన ఈ బయోబ్యాంక్ మరియు ప్రయోగశాలలో స్టెమ్ సెల్ కల్చర్ యూనిట్, ఆధునిక పరిశోధన పరికరాలు మరియు అధునాతన సాంకేతిక సౌకర్యాలు ఉన్నాయి. వ్యాధి నమూనా, కణజాల ఇంజనీరింగ్ మరియు పునరుత్పత్తి బయోటెక్నాలజీ వంటి రంగాలలో పరిశోధనలను వేగవంతం చేయడం దీని లక్ష్యం, ఇది పశువుల వైద్యం మరియు సెల్యులార్ చికిత్సలలో గణనీయమైన పురోగతికి దారితీస్తుంది. రాబోయే సంవత్సరాల్లో భారతదేశాన్ని జంతు ఆరోగ్య రంగంలో ప్రపంచ నాయకుడిగా మార్చడంలో ఈ సంస్థ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ చొరవ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో భారతదేశం యొక్క సామర్థ్యాన్ని ప్రతిబింబించడమే కాకుండా, స్థిరమైన మరియు సమ్మిళిత అభివృద్ధి వైపు ఒక పెద్ద అడుగు కూడా.

## మూడు వందే భారత్ రైళ్లను ప్రారంభించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ

బెంగళూరు పర్యటనలో భగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డ.కె శివకుమార్లతో కలిసి మూడు వందే భారత్ రైళ్లను బెంగళూరులో ఈ రోజు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. బెంగళూరు నుంచి బెళగావి, అమృత్సర్ నుండి శ్రీ మాతా వైష్ణో దేవి కాత్రా, నాగ్‌పూర్ నుండి పూణేకు ఈ రైళ్లు రకపోకలు సాగించనున్నాయి. అదేవిధంగా 15వేల 610 కోట్ల రూపాయల విలువైన బెంగళూరు మెట్రో ఫేజ్ 3 ప్రాజెక్ట్ కు ప్రధాన మంత్రి శంఖుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ లో మొత్తం 44 కిలో మీటర్లకుపైగా రైలు మార్గం, 31 ఎలివేటెడ్ స్టేషన్లు చేపట్టనున్నారు. అనంతరం ప్రధాన మంత్రి ఆర్.వి రోడ్ నుంచి ఎలక్ట్రానిక్ సిటీ వరకూ మెట్రో రైలులో ప్రయాణించారు.




## రాఖీ పండగ సందర్భంగా అద్భుతంగా ఆర్టీసీ సిబ్బంది



రాఖీ పండగ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది అద్భుతంగా పని చేశారని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. హైదరబాదులో నిన్న ఆయన మాట్లాడుతూ.. గతేడాది రాఖీ పండగ సందర్భంగా మూడు రోజుల్లో రికార్డు స్థాయిలో 1కొట్ల 77 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించారన్నారు. ఈ ఏడాది అదే రీతిలో సిబ్బంది పని చేశారని మంత్రి పేర్కొన్నారు. సోదరభావానికి ప్రతీకైన రాఖీ పండగను త్యాగం చేసి.. నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహించారని సిబ్బందిని ప్రశంసించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగాల్లో SC/ST/OBC మరియు EWS వర్గాలలో రిజర్వేషన్లకు సంబంధించిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు

ఎస్సీ / ఎస్టీ / ఓబీసీ మరియు ఈడబ్ల్యుఎస్ కేటగిరీలలోని ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసి, దాని సమాధానం దాఖలు చేయాలని కోరింది. ఇప్పుడు ఈ కేసులో తదుపరి విచారణ అక్టోబర్ 10న ఉంటుంది. పిటిషనర్లు షెడ్యూల్డ్ కులాలు మరియు ఇతర వెనుకబడిన తరగతుల వర్గాలకు చెందినవారని ప్రజా ప్రయోజన వ్యాజ్యం పేర్కొంది. ఈ పిటిషన్ ద్వారా, పిటిషనర్లు ఈ వర్గాలలోని ఆర్థిక అసమానతలను హైలైట్ చేయాలనుకుంటున్నారని, ఇది ప్రస్తుత రిజర్వేషన్ విధానాల ప్రకారం ప్రయోజనాల అసమాన పంపిణీకి దారితీసిందని పిటిషన్ పేర్కొంది. ఫోటో - సుప్రీంకోర్టు (ఫైల్ ఫోటో)

## పెద్ద ఎత్తున సోలార్ విద్యుత్ ఉత్పత్తి



సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హైదరాబాదులోని సచివాలయం నుంచి ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు, ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో ఆయన నిన్న దృశ్యమాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఇందిరా సౌర గిరిజన వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, కలెక్టర్లు వారంలోగా ఇందుకు సంబంధించిన వివరాలు అందజేయాలని ఆదేశించారు.

## తిరుమలకు వెళ్లే వాహనాలకు ఫాస్ట్ టాగ్ తప్పనిసరి





తిరుపతిలోని అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వివిధ వాహనాల్లో చేరుకునే భక్తులకు మెరుగైన భద్రతా ప్రమాణాలు, అధిక రద్దీ నివారణ, పారదర్శక సేవలు అందించే దృష్ట్యా ఆగస్టు 15వ తారీకు నుండి తిరుమలకు వెళ్లే వాహనాలకు ఫాస్ట్ టాగ్ తప్పనిసరి చేయడం జరిగింది. ఇకపై ఫాస్ట్ టాగ్ లేని వాహనాలను తిరుమలకు అనుమతించడం జరగదని టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. ఫాస్ట్ టాగ్ లేని వాహనదారుల సౌకర్యార్థం అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ఐసిఐసిఐ బ్యాంకు వారి సహకారంతో ఫాస్ట్ టాగ్ జారీ కేంద్రం ఏర్పాటు చేయడం కూడా జరిగిందన్నారు. ఫాస్ట్ టాగ్ లేని వాహనదారులు ఇక్కడ అతి తక్కువ సమయంలో ఫాస్ట్ టాగ్ సౌకర్యాన్ని పొందిన తరువాత మాత్రమే వారి వాహనాలను తిరుమలకు అనుమతిస్తారని ఆ ప్రకటన లో తెలిపారు.భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని టీటీడీకి సహకరించాల్సిందిగా ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఎన్టీపీసీకి అన్ని విధాలా సహకరిస్తాం




రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ థర్మల్ విద్యుత్తు సంస్థ - ఎన్టీపీసీకి అన్ని విధాలా సహకరిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ నేతృత్వంలో అధికారుల బృందం హైదరాబాదులో ముఖ్యమంత్రిని నిన్న మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో 80వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ఎన్టీపీసీ సంసిద్ధత వ్యక్తం చేసింది. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టనున్నట్లు బృందం వివరించింది. సోలార్, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు సుముఖత వ్యక్తం చేసింది. రాష్ట్రంలో 6 వేల 700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ఉత్పత్తికి అవకాశం ఉందని ముఖ్యమంత్రికి ఎన్టీపీసీ బృందం వివరించింది.

## ఆపరేషన్ సిందూర్ భారత సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచానికి తెలియజేశాయి- మోదీ



ఆపరేషన్ సిందూర్ భారత సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచానికి తెలియజేశాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. కర్నాటకలోని బెంగళూరులో మెట్రో మూడో దశ పనులకు ఆదివారం శంకుస్థాపన చేసి అనంతరం ప్రధానమంత్రి ప్ర-సంగించారు . పాకిస్థాన్ లోని కీలక స్థావరాలు, ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసిన నూతన భారత్ శక్తిసామర్థ్యాలను తెలిపిందని చెప్పారు.ఈ విజయానికి భారత సాంకేతికత , రక్షణా రంగంలో 'మేక్ ఇన్ ఇండియా' పరికరాలు దోహద-పడ్డాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు .

## ఆంధ్రప్రదేశ్ లో కొత్త సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు



ఆంధ్రప్రదేశ్ లో కొత్త సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈరోజు ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఒడిశాలో రెండు, ఆంధ్రప్రదేశ్ లో ఒకటి , పంజాబ్ లో కొత్త సెమీ కండక్టర్ తయారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. మంత్రివర్గ నిర్ణ-యాలను సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించింది. నాలుగు నూతన సెమీ కండక్టర్ ప్రాజెక్ట్ ల ఏర్పా-టుకు మొత్తం 4వేల 600 కోట్ల రూపాయల నిధులను కేటాయించినట్లు తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్ లో 700 మెగా వాట్ల జలవిద్యుత్ ప్రాజెక్ట్ తో పాటు లఖ్ నవూ మెట్రో ఫేజ్ 1బి నిర్మాణానికి అనుమతిచ్చినట్లు ఆయన తెలిపారు.

## ఆర్బీఐ రుణాల రీ షెడ్యూల్ - కేంద్ర ఆర్థిక శాఖ

రుణాల రీ షెడ్యూల్ మార్పు చేస్తే ఆర్బీఐ నిబంధనల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు ఖాతా స్టాండర్డ్ నుంచి షబ్ స్టాండర్డ్ కు డౌన్ గ్రేడ్ అవుతుందని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది. తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీ ఛామల కిరణ్ కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు లోక్ సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల పునర్ వ్యవస్థీకరణ చేయాలని ప్రాజెక్టు తెలంగాణ ప్రభుత్వం నుంచి వినతులు వచ్చాయి. స్పెషల్ పర్పస్ వెహికల్ కి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ , రూరల్ ఎలక్ట్రిఫి కేషన్ కార్పొరేషన్ రుణాలు ఇచ్చాయి. పీఎఫ్ సి ఆర్ఈసీ లాంటి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు , వివిధ మార్గాల్లో నిధులు సేకరిస్తాయి. వాటికయ్యే ఖర్చుల ఆధారంగా వడ్డీ రేట్లను నిర్ణయిస్తారు. ప్రాజెక్టు పూర్తయ్యే సమయాన్ని ఇప్పటికే డిసెంబర్ 2024 కు ఆర్ఈసీ పొడిగించింది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాతే రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపును పరిశీలిస్తాం అని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది.

## జస్టిస్ ఎన్ వి. రమణకు మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం



కృష్ణా జిల్లా అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో జస్టిస్ ఎన్.వి. రమణకు మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం వరించింది. మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శతజయంతి సంఘం ఈ అవార్డును ప్రదానం చేసింది. వివిధ రంగాల ప్రముఖులు జస్టిస్ ఎన్.వి. రమణ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ రమణ మాట్లాడుతూ.. ఏ జాతికైనా భాష గుర్తింపు తీసుకొస్తుందని , భాష లేకపోతే మనుగడే ఉండదని చెప్పారు. తెలుగు వాడిని అని చెప్పాలంటే భాష , సంస్కృతీ నిలబడాలి. భాష అంతరించి పోయే పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోంది. అందుకే భాషను పరిరక్షించాలని కోరుతున్నాం,

## పాక్ కు చెందిన 5 యుద్ధ విమానాలు కూల్చేశాం -- ఆపరేషన్ సింధూర్ పై ఐఎఎఫ్ చీఫ్



పహల్గామ్ దాడికి ప్రతీకారం గా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ తో పాకిస్థాన్ కు భారత్ గట్టి దెబ్బ కొట్టింది. మన సైన్యం జరిపిన మెరుపు దాడులతో శత్రు సేనల స్థావరాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. వాయు సేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ మాట్లాడుతూ ... సింధూర సమయంలో పాక్ కు చెందిన ఐదు యుద్ధ విమానాలను మన సైన్యం కూల్చేసినట్లు తెలిపారు .

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పణంగా పెట్టి బ్యారేజ్ కట్టారు -- మంత్రి ఉత్తమ్



గత పాలకులు అధిక వడ్డీలతో రూ 84 వేల కోట్లు అప్పు తెచ్చారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. భారీగా తెచ్చిన అప్పులతో చేపట్టిన కాళేశ్వరం ... రాష్ట్ర సమితి హయం లోనే కూలి పోయిందన్నారు. రాజకీయ అంశాలు జోడించకుండా విచారణ జరపాలని కోరాం. 660 పేజీలతో నివేదికను కమిషన్ నీటిపారుదల శాఖ కు ఇచ్చింది. నివేదికను ముగ్గురు అధికారుల కమిటీ 25 పేజీలతో సంక్షిప్తం చేసింది. 2016 లో మేడిగడ్డ ప్రాజెక్టు అగ్రిమెంట్ జరిగింది . 2019 లో శంకుస్థాపన చేసారు . 2023 లో మేడిగడ్డ బ్యారేజీ కూలిపోయింది.బ్యారేజీ కుంగ్ బాటుపై ఎన్ డీ ఎస్ ఏ నివేదిక ఇచ్చింది. మేడి గడ్డ నిర్మాణంలో ప్లానింగ్ లో లోపాలున్నాయని తేలింది మేడిగడ్డతో పటు అన్నారం , సందిళ్ల ప్రాజెక్టు లోనూ ఇదే సమస్య ఉందని కమిటీ వెల్లడించింది. మూడు బ్యారేజీల్లో నీటి నిల్వకు అవకాశం లేదని తెలిపింది. తుమ్మిడి పూడి వద్ద నీళ్లు లేవన్న కేసీఆర్ నిర్ణయం నిజాయితీతో కూడింది కాదని జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ పేర్కొంది

## ట్రంప్ --పుతిన్ భేటీకి కొన్ని దేశాలు అడ్డుపుల్లలు



యుద్ధం ముగింపునకు ప్రయత్నాలు చేస్తున్న డొనాల్డ్ ట్రంప్ అలాస్కా వేదికగా త్వరలో పుతిన్తో భేటీ కానున్నారని స్వయంగా ప్రకటించారు. ఈ క్రమంలో స్పందించిన రష్యా , వీరి భేటీకి అంతరాయం కలిగించేందుకు కొన్ని దేశాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని పేర్కొంది . కొన్ని దేశాలు రెచ్చగొట్టే ప్రకటనలు , తప్పుడు సమాచార వ్యాప్తికి పాల్పడుతున్నాయని రష్యన్ డైరెక్ట్ ఇన్వెస్ట్మెంట్ ఫండ్ సీఈవో కిరిల్ ది మిత్రివ్ పేర్కొన్నారు.అయితే ఏ ఏ దేశాలు ఎటువంటి ప్రకటనలు చేస్తున్నాయన్న విషయంపై మాత్రం ఆయన స్పష్టత ఇవ్వలేదు .

## కంబోడియాలో 'వేవ్స్' సదస్సు



కంబోడియాలో జరుగుతున్న ఆసియా మీడియా సమ్మిట్‌లో ప్రసార భారతి సీఈఓ గౌరవ్ ద్వివేది ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇటీవల ముగిసిన ప్రపంచ ఆడియోవిజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (WAVES) గురించి ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో భారతదేశ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు మార్గం చూపించే లక్ష్యంతో 'వేవ్స్' సదస్సును నిర్వహించారు. వందకు పైగా దేశాల భాగస్వామ్యం, లక్ష మందికి పైగా సందర్శకులు, మూడు వేలకు పైగా కంపెనీలతో 'వేవ్స్'జరిగిందని గౌరవ్ ద్వివేది పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సాధనాల ద్వారా మీడియా కంటెంట్ సృష్టి, అలాగే డిజిటల్ న్యూస్‌రూమ్, డిజిటల్ జర్నలిజం, డేటా స్టోరీటెల్లింగ్ , రిపోర్టింగ్‌లో తాజా నైపుణ్యాలతో తీర్చిదిద్దుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. వేవ్స్ ప్లాట్‌ఫామ్ 50 మిలియన్లకు పైగా కుటుంబాలకు ఉచిత, అధిక నాణ్యత గల ఆడియో మరియు వీడియో కంటెంట్‌ను అందిస్తోందని గౌరవ్ ద్వివేది వెల్లడించారు.

## హర్ ఘర్ తిరంగా

దేశ వ్యాప్తంగా ప్రజలలో దేశ భక్తిని పెంపొందించేలా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా కర్నూలులో అతి పెద్ద జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఓమౌజయా యునైటెడ్ యంగ్ స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వందల మీటర్ల త్రివర్ణ పతాకంతో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ప్రారంభించిన ఈ ర్యాలీలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు పాల్గొన్నారు. గతంలో గుజరాత్‌లో 3వేల200 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..... ప్రస్తుతం కర్నూలులో 3వేల 500 అడుగుల త్రివర్ణ పతాకంతో ర్యాలీ చేసి రికార్డు సృష్టించబోతున్నట్లు వెల్లడించారు,

## ప్రపంచ సింహాల దినోత్సవం

నేడు ప్రపంచ సింహాల దినోత్సవం. ఈ సందర్భంగా... గుజరాత్‌లోని బర్డా వన్యప్రాణుల అభయారణ్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ ... గుజరాత్ ముఖ్యమంత్రిభూపేంద్ర పటేల్ ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. 11 జిల్లాల నుండి లక్షలాది మంది విద్యార్థులు వర్చువల్‌గా హాజరుకానున్నారు. కాగా... నాలుగు సింహాల చిహ్నం జాతీయ చిహ్నంగా కొనసాగుతోంది. అంతేకాకుండా... ఆసియాటిక్ సింహాలకు భారత్ కేంద్రంగా ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా దేశంలోని సింహాల సంఖ్య క్రమంగా పెరిగింది. 2015లో 523
సింహాలుండగా.. 2025లో వాటి సంఖ్య 891 సింహాలకు పెరిగింది.

# కాశీమజిలీ కథలు



డా. మాదిరాజు బ్రహ్మానంద రావు

## రెండవ భాగము

### మణిసిద్ధుడు-కోటప్ప

కాశీమజిలీ కథలను చెప్పిన కథకుడు మణిసిద్ధుడు. ఆ కథలను విన్న శ్రోత కోటప్ప. కథకు కథ చెప్పేవాడెంత అవసరమో కథను వినేవాడు కూడా అంతే అవసరం. చెప్పేవాడుండి వినేవాడు లేకపోయినా-వినేవాడుండి చెప్పేవాడు లేకపోయినా కథ ప్రచారంలోకి రాదు. దానికి ప్రయోజనం కూడా ఉండదు. అందుకే కాశీమజిలీ కథలకు కూడా మణిసిద్ధుడు-కోటప్ప అవసరమౌతున్నారు.

రచయిత కథకునిగా ఎవరో ఒకరిని ఎంచుకోడు. లోకానుభవం, ధర్మాధర్మాలు, న్యాయాన్యాయాలు, పాపపుణ్యాల పరిజ్ఞానం కలిగిన వానిని-వివిధశాస్త్రాలు, పురాణేతిహాసాలు కరతలామలకమయిన వానిని- వివిధ దేశాచారాల విధివిధానం తెలిసి ఉన్నవానిని కథావక్తగా ఎన్నుకుంటాడు. అట్లాంటి కథావక్తకు శ్రోతలకు కలిగే అనేకానేక సందేహాలకు విసువులేకుండా వెనువెంటనే సమాధానం చెప్పగలిగే సద్యఃస్ఫూర్తి ఉండాలి. ధారణాశక్తి, చమత్కారం, హాస్యప్రియత్వం కలిగి ఉండటం వక్త నేర్పరితనాన్ని తెలియజేస్తుంది. మణిసిద్ధుడు కూడా ఇట్లాంటి లక్షణాలన్నీ ఉన్నవాడే కాక అన్నిటికి మించి అతనికి ఒక అన్ని విషయాలను మణిద్వారా తెలుసుకొనే ఒక అలౌకిక శక్తి కూడా ఉంది. మణిసిద్ధుని అసలుపేరది కాదు. అతనికి తల్లిదండ్రులు పెట్టిన పేరు గుణనిధి. ఇతడు కొల్హాపుర నివాసియైన యజ్ఞశర్మ అనే బ్రాహ్మణునకు అగ్నిహోత్రుని వరాన పుట్టాడు. యుక్తవయసు నాటికే సర్వశాస్త్రాలనభ్యసించి మనస్సన్న్యాసం స్వీకరించాడు. తల్లిదండ్రుల మరణానంతరం తత్త్వజ్ఞానాన్ని పొందటానికి గురువును వెదుకుతూ ఒకనాడు ఊరిలో ఉన్న దేవాలయానికి వెళ్లాడు. అక్కడ విడిదియైన ఒక సిద్ధుని చూచి తనకు సన్యాసమిప్పింపుమని కోరాడు. అతడు గుణనిధి కారణజన్మునిగా తెలిసికొని " నీవలన కొన్ని పురాతన గాథలు భూలోకంలోకి రావలసి యున్నా" యంటూ ఒక రత్నాన్ని ఆతనికిస్తూ " సుయత్నా! నీవీ రత్నాన్ని-ముందుబెట్టుకొని పూజించి కన్నులు మూసుకొని ధ్యానిస్తే భూతభవిష్యద్వర్తమాన కాలాల్లో జరిగిన కథావృత్తాంతాలన్నీకరతలామలకంగా నీకు సాక్షాత్కరిస్తా"యని చెప్పి ఈ మణిసిద్ధించుటచే నీకు మణిసిద్ధుడనే పేరుపెడుతున్నానన్నాడు. తరువాత అతడు గోవిందతీర్థులనే యతీంద్రుని వద్దకు పోయి సన్న్యాసాన్ని స్వీకరించి మణిసిద్ధయతీంద్రుడయ్యాడు.

యతియైన మణిసిద్ధుడు ఒకసారి కాశీకి పోవాలనుకున్నాడు. లోకంలో ఒంటరిగా యాత్ర చేయకూడదనే ఒక

నియమముంది. అందుచేత తోడు కొరకు బంధువులను, ఊరిలోని పరిచయస్తులను, దగ్గరివారిని అడిగి చూచాడు. కాని అతనితో కాశీకి రావటానికి వారిలో ఎవరూ ఒప్పుకోలేదు. అతడు మార్గ సహాయునకై వెతుకుతూ చివరకు శ్రీరంగపురం చేరుకున్నాడు. అక్కడ కోటప్ప అనే గొల్లోళ్లచిన్నోడిని కలిశాడు. కాశీకి తనతో పాటు రమ్మని కోరగా అతడు 'సరే' యని అన్నాడు. ఇతడే కాశీమజిలీ కథలకు శ్రోతయైనాడు.

కోటప్ప అనాథ. చిన్నప్పుడే అతని తల్లిదండ్రులు చనిపోయారు. ఆ ఊరి పెద్దకాపు అతనిని పెంచి తన పశువులకు కాపరిగా చేసుకున్నాడు. కాని కోటప్పలో అతనికే తెలియని ఒక ఆత్మాభిమానముంది. అతనిని ఎవరైనా గాని చివరకు తనను పెంచిన పెద్దకాపుని కూడా 'ఒరేయ్' అని పిలువనీయనట్టి స్వతంత్ర ప్రవృత్తి కలిగినవాడు. తనను పెంచి పెద్దచేసిన యజమానిని వదలి ముక్కూ మొగం తెలియని సన్యాసి వెంట కాశీకి పోవటానికి ఈ మాత్రం స్వతంత్ర ప్రవృత్తి కలవాడై ఉండటం అవసరం. కథలంటే మక్కువ గలవాడు. అంతకుముందే భారతంలోని కథలు, వరాహావతార చరిత్ర, కామమ్మ కథలవంటి జానపద గాథలు విన్నాడు. మణిసిద్ధుడాతనికి కాశీ గొప్పతనాన్ని గురించి చెప్పాడు. ఇంకా ఇట్లాంటివే అనేక కథలు చెపుతానన్నాడు. కథలంటే చెవికోసుకొనే అతడు మణిసిద్ధుడు చెప్పిన కాశీమాహాత్మ్యాన్ని విన్న తరువాత అతనితో కాశీకి రావటానికి అంగీకరించాడు. అయితే అందుకు ఒక నియమం పెట్టాడు." నేను మీతో వచ్చేటపుడు నడుమ తోవలో ఏదైనా ఒక వింత కనబడితే దాని గురించి నేను ప్రశ్నలడుగుతాను. ఆ ప్రశ్నలకు మీరు తప్పనిసరిగా నాకు ఒక కథగా జవాబు చెప్పాలి. ఇందుకిష్టమైతేనే మీ వెంట మీ మూటను కూడా మోసుకొని కాశీకి వస్తా"నని ఖండితంగా చెప్పాడు. అందుకు మణిసిద్ధుడు సరేనన్నాడు. కోటప్ప విచిత్రాలైన కథలను మార్గమధ్యంలో చెపుతానన్న మాట తీసుకొని సన్యాసి మూటను మోస్తూ కాశీకి బయలుదేరాడు. భారతాది ఇతిహాసాలతో పాటు అనేక పురాణాలను సూతుడు శౌనకాది మునులకు చెప్పినట్లుగా మణిసిద్ధుడు కోటప్పకు భారతాది ఇతిహాసాలుగా కాశీమజిలీ కథలను చెప్పాడు.

కాశీమజిలీ 12 భాగాల్లోను 42 అద్భుత కథలున్నాయి. అందులో విక్రమార్కునికథ-భోజ కాళిదాసులకథ- శ్రీకృష్ణదేవరాయ రామలింగని కథ-లవంగి పండితరాయల కథ-శంకరాచార్యుల కథ-ఫణిదత్తుని కథ-బంగారు మూషికము కథ-చేపనవ్విన కథల వంటివి మనలనెంతో నలరిస్తాయి. ఈ కథలన్నీ సామాన్యంగా లోకంలో మనం విన్న కథల్లాగా ఉండవు. ఈ కథల్లో అనేక ఇతిహాస, పౌరాణిక కథలను జోడింపబడ్డాయి. ఇంతేగాక సంస్కృత కథారచయితల కథలు కూడా ఇందులో జతపరచబడ్డాయి . ముఖ్యంగా గుణాఢ్యుని బృహత్కథనుండి గ్రహింపబడిన అనేక కథలు సందర్భానుసారంగా ఇందులో కలిసిపోయాయి. సాహసకథలు-శృంగారకథలు; పౌరాణిక చారిత్రక-లౌకిక కథలెన్నో మనలను అద్భుతరసంలో ముంచితేలుస్తుంటాయి.

( 33 వ పేజీ చూడండి)

# క్రాంతివీరుడు
# (పండిత్ శ్యామ్ జీ కృష్ణవర్మ)



తుమ్మూరి రాంమోహన్ రావు

చిగురు:

మౌనంగా ఎదుగుమనుచు
చెప్పుతుంది చెట్టు మనకు
పుష్పించి ఫలించి ఎపుడు
బతుకుమనును పరులకొరకు

ఎదుగుటకై భూమి పొరలు
చీల్చుకొనుచు కొనసాగును
పెరుగుటకై ఎండ పొడలు
పీల్చుకొనుచు పోరాడును

తనపూవులు తనకు కావు
తనఫలాలు తనకు కావు
తరువు దెంత ఆదర్శం
తన గాలులు తనకు కావు

పుట్టగనె పరిమళాలు
పంచు పూవు ఆదర్శం
చెట్టు ఎదుగుదలకు చేవ
నొసగు కొమ్మదే హర్షం

దినం దినం విస్తరించు
తరువాకులు కొమ్మలతో
ఎదుగుతున్న తరువొసంగు
ఆశ్రయమ్ము నీడలతో

చెట్టునున్న ప్రతికొమ్మా
ఎదుగుదలకు సంకేతం
మనిషిలోని త్యాగగుణం
మానవతకు సందేశం

శ్యామకృష్ణ వర్మ భరత
ఖ్యాతి నిలిపె పరసీమల
పరిమళగంధపు తరువుగ
ప్రభలు నింపె ప్రపంచాన

నిప్పులాంటి నిజాయితీ
పరుడు పండితుండు
నిష్కళంక దేశభక్త
క్రాంతి మండితుండు

రణభూమిగ శత్రు స్థావ
రమును ఎంచుకొనెను
జన్మభూమి స్వేచ్ఛ కొరకు
చదువు పంచుకొనెను

చిరకాలం అజ్ఞాతం
అతని దేశసేవ

కలకాలం స్ఫూర్తిమంత

మతని తెలివి చేవ

శ్యామ్జీ కృష్ణవర్మ

జీవితమొక అద్భుతం

అతని చరిత తెలుసుకొనుట

అందరికీ అవశ్యం

మొదటి కొమ్మ

కర్మభూమి ధర్మభూమి

క్రాంతి భూమి నా దేశము

పుణ్య భూమి పూతభూమి

శాంతి భూమి నా దేశము

సిరుల తోడ తులతూగెను

నరుల తెలివి నడయాడెను

అప్రమేయ జ్ఞాన కాంతి

ఛటలతోడ వెలుగొందెను

వేలఏండ్ల ఘన చరిత్ర

కలిగిన హిందూదేశం

ఆర్షసంప్రదాయానికి

ఆలవాలమీ దేశం

చతుర్వేద సారమతులు

ఉపనిషదుద్యానరతులు

శిక్ష వ్యాకరణము నిరుక్త

జ్యోతిషాది శాస్త్రవిదులు

ప్రభవించిన దీ దేశం

విలసిల్లిన దీదేశం

సకల శాస్త్ర పారంగతు

లలరించినదీ దేశం

ఏబదారు రాజ్యాలుగ

ఏలుబడులు కొనసాగెను

వేల ఏండ్ల ధర్మ నిరతి

విహిత సంస్కృతిగ తూగెను

భరతజాతి ఖ్యాతి ఖండ

ఖండాతరములు దాటెను

భరతభూమి సిరిసంపద

లొరుల కంటగింపాయెను

ఇరుగుపొరుగు దేశపతుల

ఈర్ష్యాసూయాగ్రహాల

కెరయాయెను బలియాయెను

వలసలకిది నెలవాయెను

కైబరు కనుమను దాటిరి

బాబరాది బాహ్య రిపులు

స్థాపించిరి తమ రాజ్యము

స్థానికుల అనైక్య కతము

అన్యమత ప్రాబల్యము

అణగగొట్టె మన సంస్కృతి

హింసాయుత పరిపాలన

బెదరగొట్టె మన జాగృతి

వందలాది వత్సరాలు

మహ్మదీయ పరిపాలన

భరతదేశ మాత దాస్య

శృంఖలాల దీనవదన

అధికారమదాంధకార

పరిపాలనమయోమయము
మెడల మీద కత్తి యునికి
మెసలలేనిదాసమయము

పులి మీదుగ పుట్ర యటుల
అరుదెంచిరి ఆంగ్లేయులు
అదను చూచి చేపట్టిరి
ఆపై తమయధికారము

రోలు పోయి మద్దెలొచ్చి
భరతజాతి ఈడిగిలెను
తెల్లదొరల ఆగడాల కొక
ఎరగా అది మిగిలెను

సమీకృతపు సైనిక బల
మాంగ్లేయుల అండదండ
మాట వినని వారి పైన
దారుణమగు  దమనకాండ

స్వేచ్ఛ లేక ఎల్లెడలా
తల్లడిల్లె భరతధాత్రి
స్వస్థలాన బానిసత్వ
మనుభవించె భరతజాతి

పదునారవ శతాబ్దాన
బ్రిటిషు ఓడవర్తకాళి
కలిమివేట యాత్రలిచట
ఆంగ్ల పాలనకు బీజము

తూరుపులో గల సిరులను
పసిగట్టిన బ్రిటిషు ఘనులు
కబళించగ కార్యశీల
యత్నము ప్రారంభించిరి

ఓడలపై విదేశీయ
వ్యాపారపు  వ్యవహారం
బ్రిటిషు రాణి విక్టోరియ
ఆమోదం అవసరం

విన్నపము సమర్పించిరి
బ్రిటిషురాణినొప్పించిరి
అనుమతి గొని ఓడలపై
తూరుపు దిశకై సాగిరి

ఈస్టిండియ కంపెని యను
పేరుతోడ వ్యాపారము
తొలుత సూరతున ఆపై
బందరులో చేపట్టిరి

పాదుషా జహంగీరుకు
ప్రార్థనమొనరించుకొనిరి
అతనిని సంతోషపెట్టి
అనుమతి పత్రమును గొనిరి

ఒంటె గుడారము కథవలె
ఒడుపుగ సంస్థానాలకు
రక్షణ బలముల పేరిట
ప్రభువులకడ ప్రాపుగొనిరి

సైనిక సముదాయాలను
నెలకొల్పిన రుసుములకని
జిల్లాలకు జిల్లాలే
దత్తత కైవసము గొనిరి

ప్లాసీ యుద్ధము బెంగాల్
నవాబు సిరజుద్దౌలా
రాబర్టు క్లైవు నడుమ
జరుగుటతో మొదలైనది

అతనిని ఓడించి గద్దె
నెక్కినారు బెంగాలున
ఒకటొకటిగ ఆపై పలు
ప్రాంతాలు జయించినారు

వ్యాపారిగా వచ్చినాడు
పరిపాలన తెచ్చినాడు
దమన నీతితో భారత
ప్రజలను హింసించినాడు

తెల్లదొరల దౌర్జన్యం
నానాటికి పెచ్చరిల్లె
భరతజాతి పౌరుషాగ్ని
రోజు రోజు ప్రజ్వరిల్లె

తూటాలకు పందికొవ్వు
పూయబడిన విషయమెరిగి
నోటకరచి ఒలువలేక
సిపాయీలు తిరుగబడిరి

ఆంగ్లేయుల ఒడంబడిక
ఆభిజాత్యమునకు వేటు
అని తెలిసిన ఝాన్సీ రాణి
లక్ష్మిబాయి తిరుగబడెను

చిచ్చుపిడుగువోలె ఆమె
ఆంగ్లేయుల నెదిరించెను
కదనరంగమున పోరుచు
వీరమరణమును బొందెను

దక్షిణాది పాంచాలకు
రిచ్చి రాజు వీరపాండ్య
కట్టబొమ్మనను వధించి
రెదిరించిన నెపమును గొని
భరతమాత బానిసత్వ

నిర్మూలన జరుగుటెలా?
దుర్భరమగు ఆంగ్లేయుల
పీడన తప్పించుటెలా?

రెండవ కొమ్మ

సిపాయీల తిరుగుబాటు
జరిగిన సంవత్సరాన
భన్సాలీ వంశములో
శ్యామకృష్ణ వర్మ పుట్టె

నాటి కచ్ఛ రాజ్యంలో
మాండ్వీ అనే గ్రామంలో
అక్టోబరు నాలుగు నా
డుదయించెను శ్యాముడు

జనకుడు కర్సన్ నఖువా
పత్తిబేళ్ల కార్మికుండు
శ్యామ్ చిన్ననాడె పోయె
మాత రమా/గోమతీబాయి

మాతామహి చేరదీసి

పెంచి పెద్దజేసెనతని
బడిచదువును పూర్తిజేసె
భుజ్ నగరము బడిని

నాటి కచ్ కు రాజధాని
పట్టణమీ భుజ్ పురం
భుజంగ పర్వత ఛాయల
నెలకొన్నది ఈ నగరం

నాటి వైభవాల చిహ్న
మచటగలదు గిరిదుర్గం
మహారావు హామిర్ ఖెం
గర్జీ ప్రభువుల స్వర్గం

శ్యామకుమారుడు బడిలో
అన్నిట సర్వ ప్రథముడు
అచ్చెరువును కలిగించును
అతని ప్రతిభ పాటవాలు

ఆ సమయము బొంబైలో
విష్ణుపరశురామ శాస్త్రి
తదితరులొకచో గూడిరి
సంఘసంస్కరణము దిశలో

ఆర్యసమాజ ప్రభావము
అందరిపై పడియుండుట
అందులకొక కారణము
అదే మంచి ప్రేరణము

అస్పృశ్యత బాల్యవివా
హాల వల్ల జరుగు హాని
బ్రాహ్మణీయ భావజాల
మందున గల హీన గ్లాని

రూపు మాప తలపెట్టిరి
వణిజులు మద్దతు తెలిపిరి
వితంతువుల వివాహాలు
వంటి పనులు చేపట్టిరి

దీనికి తోడుగ సంస్కృత
విద్యను అబ్రాహ్మణులకు
అందించుటకై యోచన
గావించిరి వీరందరు

బొంబాయిలో నివసించెడు
మధురదాసు లావాజీ
కచ్ ప్రాంతానికి చెందిన
సంస్కర్తయు దానశీలి

అతడు శ్యామ్జీ కృష్ణుని
గూర్చి తెలిసి వెనువెంటనె
అతనిని చదివించదలచె
అన్ని ఖర్చులను భరించి

లావాజీ పిలిపించెను
శ్యాముని ముంబైనగరము
విల్సన్ హైస్కూలులోన
ఆ బాలుని చేర్పించెను

సంస్కర్తల అభీష్టాన
సాయంత్రము వేళలలో
సంస్కృతమును అభ్యసించె
శాస్త్రి విశ్వనాథునికడ

పొద్దున విల్సన్ బడిలో

సాయంత్రము సంస్కృతమ్ము
సవ్యసాచియై రెంటను
భవ్యమైన ప్రగతి గలిగె

సంస్కృత భాషా పాండితి
తలధరించె మకుటముగా
అదియే ఆతని భవితకు
నిలిచెను ఒక కీలకముగ
గోకుల్ దాస్ ఖందా ఉప
కారవేతనము పొందెను
అంతియే కాదెల్ఫిన్ స్టన్
పెద్దబడిలో చేర్చబడెను

సామాన్య ప్రజానీకపు
పిల్లలకై విల్సను బడి
శ్రీమంతుల పిల్లలకై
ఎల్ఫిన్ స్టన్ పాఠశాల

ఛాబిల్ దాస్ లాలూభాయ్
సేఠు వర్తక శ్రేష్టుడు
అతని కొడుకు రామదాసు
మిత్రుడాయె శ్యామునికట

అష్టాదశ వర్షమ్మున
అర్ధాంగిగ భానుమతిని
తనమిత్రుని సహోదరిని
కులాంతరపు పెండ్లియాడె

మామ మహా శ్రీమంతుడు
భాటియా కులాన్వయుండు
బావమరిది రామదాసు
మనసెరిగిన తనమిత్రుడు
విద్యగరపె వివాహించె
సద్యోగము నాశ్రయించె
ఆర్య సమాజము స్థాపకు
డైన దయానంద గడిసె

తొలి సమాగమములోనె
దయానంద శ్యామునిగని
నిండు హర్షమును వహించె
శిష్యత్వమనుగ్రహించె

విద్వన్మణి దయానంద
సరస్వతి మహాశయుండు
వేదములను వింగడించి
కొత్తవెలుగు జూపెనతడు

గుజరాతున తన్కారా
గ్రామములో నుద్భవించి
మూల శంకర త్రివేది
దయానందుడుగ మారెను

అతడు సకల జనుల హితుడు
ఆధ్యాత్మిక సంపన్నుడు
వేదసంస్కృతీ పునర్వి
కాసమునకు పుట్టెనతడు

వేదమ్ములు శాస్త్రమ్ములు
కాచి వడియబోసెనతడు
పుడమి యంతటికి ధర్మము
ఒక్కటి యని చాటెనతడు

సర్వ మతమ్ముల యందలి
సత్సారము దెలియ పరచి
ఆర్యసమాజము నిచ్చట

# షడ్దర్శనాలు

**కీ. శే. వేమూరి నరసింహమూర్తి & వేమూరి వేంకటేశ్వరరావు**



**వేమూరి వేంకటేశ్వరరావు**

(గత సంచిక తరువాయి)

**3 ఈ. యోగ దర్శనం**

యోగసూత్రకారుడైన పతంజలి ( సా. శ. 400) "ప్రకృతి, పురుషుడితో పాటు ఆదిమధ్యాంతములు లేనివాడు, సర్వశక్తిమంతుడు అయిన దేవుడు ఉన్నాడు" అంటాడు. అనగా, పతంజలిది సేశ్వర సాంఖ్యం.

**3 ఉ. పూర్వమీమాంస**

పూర్వమీమాంస వేదములకు పూర్వ భాగమైన బ్రాహ్మణములని విచారిస్తుంది. పూర్వమీమాంసకులు జైమిని మహర్షి అనుయాయులు. జైమిని వేదవ్యాసుని శిష్యుడని అంటారు. వేరొక జైమిని ఉన్నాడనిన్నీ, ఆయన సా. శ. 200 - 450 మధ్య కాలం వాడనిన్నీ, నాగార్జునిడి సమకాలికుడనిన్నీ పుస్తకాలలో కనిపిస్తుంది. పూర్వమీమాంసకులకి వేదమే ప్రమాణం. వీరు జగత్తుకి నిమిత్త కారణం (efficient cause) దేవుడు అని ఒప్పుకోరు. దేవుడు లేడనీ వాదించరు. జగత్తు యొక్క చర్య అంతా కర్మ మీద ఆధారపడి ఉంటుందంటారు. కర్మలు తప్ప మరేదీ ప్రధానం కాదంటారు వీరు. సత్కర్మానుష్ఠానము వల్ల స్వర్గసుఖాలూ, ఉత్తమ జన్మలూ కలుగుతాయని వీరి నమ్మకం.

**3 ఊ. ఉత్తర మీమాంస**

ఉత్తర మీమాంస (వేదాంతం) వేదములకు ఉత్తర భాగమైన ఉపనిషత్తులని విచారిస్తుంది. ఉత్తర మీమాంస సూత్రాలు బాదరాయణుడి గురుకులం నుండి ప్రభవించాయని విజ్ఞుల నమ్మకం. బాదరాయణుడే వేద వ్యాసుడనిన్నీ, వేదవ్యాసుడే కృష్ణద్వైపాయనుడనిన్నీ, ఇతడే వేదాలని సంస్కరించినవాడూ, బ్రహ్మసూత్రాలు రచించినవాడూ, భారత కథని వ్రాసిన వాడూ అని అందరి నమ్మకమును. ఇతని శిష్యవర్గంలోని వారిలో జైమిని మహర్షి ఒకరు. సనాతనుల నమ్మకం ప్రకారం వేద వ్యాసుడు ద్వాపర యుగాంతానికి చెందినవాడు. అనగా సా. శ. పూ. 3000 సంవత్సరాల కాలం వాడు. ఉపనిషత్తులన్నీ ఒక్క వ్యక్తి జీవితకాలంలో కాక అనేక శతాబ్దాల కాలంలో "రచించబడ్డాయి" అనిన్నీ వాటి రచనా కాలం సా. శ. పూ. 600 నుండి 300 వరకు అని శిష్టుల అభిప్రాయం. కొన్ని ఉపనిషత్తుల రచనా కాలం సా. శ 100 అయి ఉండవచ్చని కొందరి నమ్మకం.

వేదాంత తత్త్వం భారతదేశంలోనూ, దేశాంతరాలలోనూ బహుళంగా వ్యాపించిన మహాతత్త్వం. స్థూలంగా వేదాంత తత్త్వాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు. ఒకటి, ఏకత్వం లేదా అద్వైతం. దీనినే నిర్గుణ బ్రహ్మారాధన అని కూడా అంటారు. రెండు, ఏక దేవత్వం, అనగా దేవుడొక్కడే అనే భావన. ఇది సగుణ బ్రహ్మారాధన. వైష్ణవ సాంప్రదాయాలయిన రామానుజ, మధ్వ, వల్లభాచార్య, నింబార్క, చైతన్య తత్త్వాలు సగుణ బ్రహ్మారాధనని వర్ణిస్తాయి. వీటి గురించి వివరంగా తర్వాత చూద్దాం.

నిర్గుణ బ్రహ్మతత్త్వం (absolute non-dualism) గురించి ముచ్చటించే ముందు బౌద్ధమతం గురించి కొంత తెలుసుకోవాలి.

**4. బౌద్ధం**

గౌతమ బుద్ధుడు (సా. శ. పూ. 500) మొట్టమొదట సారనాథ్ లో చేసిన ఉపదేశ సారాంశాన్ని నాలుగు "ఆర్య సత్యములు" అన్న పేరుతో పాళీ గ్రంథాలు వివరించాయి. అవి ఏమిటంటే:

1. జీవితము దుఃఖపూరితము. ఈ జీవితమే ఒక జాడ్యము.
2. ఈ జాడ్యమునకు కారణము "అవిద్య." అనగా, ఆత్మ యొక్క నిజ స్వరూపమును ఎరుగకపోవుట.

(సశేషం)

# భారతదేశ అభివృద్ధిలో భాగస్వామ్యులు..



ఒక దేశ అభ్యుదయం ఆ దేశ ప్రజల ధార్మిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వికాసంపై ఆధారపడి ఉంటుంది. విద్య, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, వ్యాపారవాణిజ్య రంగాలు అభ్యుదయ సూచికలుగా చెప్పుకోవచ్చు. ప్రజల ధార్మిక చైతన్యం సంపదను పెంచుకోవడం, పంచుకోవడంల కొలమానంగా చెప్పుకోవచ్చు."ధర్మస్య మూలం అర్థః" అంటాడు, ఆచార్య చాణక్య. సంపద సృష్టింపబడితేనే ఉపాధికల్పన, సంక్షేమాల అమలు సాధ్యపడుతుంది. ప్రభుత్వపాలనా విధానంలో దూరదృష్టి, జాతీయ సమగ్రత, ప్రజారక్షణలకు ప్రాధాన్యత లభిస్తేనే వికసన, విస్తరణ కలుగుతుంది.. జాతికూడా యువశక్తిని సరైన మార్గంలో వినియోగించుకొని అభ్యుదయాన్ని సాధించ గలుగుతుంది.

ఈనాడు జాతీయ ఆర్థిక అభ్యుదయాన్ని గణించేందుకు దేశీయ స్థూల ఉత్పత్తులు/ సేవలను ప్రాతిపదికగా తీసుకుంటున్నాము. దానినే జి.డి.పి. గావ్యవహరిస్తారు. జి.డి.పి. వృద్ధినే ఆ దేశాభ్యుదయ వికాసంగా విస్తరణగా చెప్పుకుంటాము. అలాగే.. మొత్తం దేశం సాధించిన ఆర్థికాభివృద్ధిని దేశ జనాభాతో విభాగించి దానిని జాతీయ తలసరి ఆదాయంగా గణిస్తారు. అది దేశ ప్రజల కొనుగోలుశక్తికీ, ప్రామాణికమైన జీవన విధానానికి సూచికగా నిలుస్తుంది. ఉత్పత్తులు/సేవల వినియోగంలో ప్రజల జీవనవ్యయం, కొనుగోలు శక్తి.. ద్రవ్యోల్బణ గణనలో ప్రముఖపాత్రను పోషిస్తాయి. అసమర్ధ ప్రభుత్వ నిర్వహణ వల్ల సంపద కొందరి స్వార్థప్రయోజనాలకు, విలాసాలకు మాత్రమే పరిమితమయితే దేశంలో నిరుద్యోగత పెరిగిపోయి అరాచకాలకు దారితీయవచ్చు. తద్వారా.. అశాంతి పెరిగిపోయి పెట్టుబడులకు దారులు మూసుకుపోవచ్చు.

ఈ క్రమంలో ఊర్ధ్వముఖంగా సాగే జి.డి.పి. ప్రజలకొనుగోలు శక్తికి అద్దంపడుతుంది.. ప్రభుత్వం వ్యవసాయ రంగంపై దృష్టిని కేంద్రీకరించి, సాగునీటిలాంటి వసతులను కల్పిస్తే ప్రజలకు ఆహారభద్రత కలుగుతుంది. వాణిజ్య రంగానికి అవసరమైన విద్యుచ్ఛక్తి లాంటి మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారిస్తే.. వ్యాపారవాణిజ్య వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తారు. రహదారుల విస్తరణ, విమానాశ్రయాల ఏర్పాటు, ఓడరేవుల అభివృద్ధి వల్ల వస్తు రవాణా వేగవంతమై, వ్యాపార నిర్వహణ సులభతరమౌతుంది. దానివల్ల యువతకు ఉపాధి కలుగుతుంది. జాతికి ఆర్థిక సుస్థిరత కలుగుతుంది.

శాస్త్రీయ పరిశోధనలు, భారీపరిశ్రమలు, విమానాశ్రయాలు, విమాన రవాణారంగం, విద్యుత్ పరిశ్రమలు, వస్త్ర పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగాలు ప్రజలకు ఉపాధినివ్వడమేకాక జాతీయ అభ్యుదయంలో ప్రముఖపాత్రను పోషిస్తున్నాయి. వీటిని స్థాపించి నిర్వహించే వ్యాపారవేత్తల భాగస్వామ్యం, సహకారాలు జాతీయ ఉపాధిరంగానికి, ఆర్థిక రంగానికి ఊతమిస్తూ.. దేశ జి.డి.పి. పెరుగుదలను బలోపేతం చేయడంలో ప్రముఖపాత్రను పోషిస్తున్నాయి.

ఈ వరసలో భారతీయ జాతీయ అభ్యుదయానికి వీధివ్యాపారుల భాగస్వామ్యం చెప్పుకోదగినది. అసంఘటిత రంగంలో జీవనాన్ని సాగిస్తున్న వీధివ్యాపారుల ఆధ్వర్యంలో National Association of Street Vendors of India (భారతీయ జాతీయవీధి వ్యాపారుల సంఘం) అంచనాల ప్రకారం ప్రతిరోజు దాదాపుగా

8000 కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయని అంచనా. వీరి భాగస్వామ్యం జాతీయ జి.డి.పి.లో దాదాపుగా 63 శాతంగా అంచనా. ఇది అంచనా మాత్రమే.. నిజానికి దేశాభ్యుదయంలో వీధివ్యాపారుల భాగస్వామ్యమే సింహభాగంగా చెప్పుకోవాలి. (పరిశ్రమలు 28.25% మరియు వ్యవసాయం18.42%గా అంచనా). వీధి వ్యాపారాలు దేశవ్యాప్తంగా దాదాపుగా 60 లక్షల మందికి ఉపాధిని కల్పిస్తునాయని అంచనా. వీరిపై దాదాపుగా 10 నుండి 11 లక్షల మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెపుతారు. అంతేకాదు, సాధారణ ప్రజలు నిత్యావసర వస్తువులు సమకూర్చుకోవడానికి ఎక్కువగా ఈ వీధి వ్యాపారులపైనే ఆధారపడుతున్నారని అంచనా.

జాతీయ అభ్యుదయ వికసనలో వీధివ్యాపారుల భాగస్వామ్యాన్నిగుర్తించిన భారత ప్రభుత్వం.. పి.యం. స్వనిధి (Prime Minister's Street Vendors Atmanirbhara Nidhi) ద్వారా అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తూ వీధివ్యాపారులు ఆర్థికస్వావలంబనను సాధించేందుకు, జీవన ప్రమాణాలను పెంచుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది.

అలాగే.. నీతి ఆయోగ్ మే నెల 2025 లో విడుదల చేసిన నివేదిక ప్రకారం.. MSME (Mocro, Small, Mdium Enterprises--సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు) భాగస్వామ్యం భారతీయ జీ.డి,పి కి దాదాపు 29%గా చెప్పబడుతున్నది. అలాగే దాదాపు 60% ఉపాధి అవకాశాలు ఈ రంగంలో గుర్తింపబడ్డాయి.

2025 ఏప్రిల్ నెల, ఎకానమిక్ టైమ్స్ ప్రకారం.. వివిధ ఉత్పత్తులు, సేవలను వివిధ దేశాలకు ఎగుమతులు చేయడం ద్వారా.. 2024-25 సంవత్సరానికి గాను భారతదేశానికి దాదాపు 824.9 బిలియన్ అమెరికన్ డాలర్ల ఆదాయం వచ్చింది.

భారతదేశ అభివృద్ధిలో టాటాలు, బిర్లాలు కావచ్చు అంబానీలు, ఆదానీలు కావచ్చు మిగతా రంగాలలో ఉన్న పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తల భాగస్వామ్యం జాతీయ అభ్యుదయ సూచికలో ఎక్కువగానే ఉంటుంది. కాని సమగ్రంగా దర్శించాలనే భావనతో.. కొద్దిగా పెద్దగనే వ్రాసాను.

మీకు ఎడిట్ చేసుకునే స్వేచ్ఛ ఉన్నదని భావిస్తున్నాను.

నమస్సులతో

పాలకుర్తి రామమూర్తి

---

# కాశీమజిలీ కథలు

(24 వ పేజీ తరువాయి)

సామాన్యంగా ఒక కథకు ఒక నాయకుడుంటటం సహజం. కాని కాశీమజిలీకథల్లో ఒకడే కాదు-ఇద్దరు, ముగ్గురు నాయకులున్న కథలున్నాయి. వరప్రసాదుల కథలో ఐదుగురు కథానాయకులున్నారు. సప్తమిత్ర చరిత్రలో ఏడుగురు కథానాయకులున్నారు. సంస్కృతంలో దండి దశకుమార చరిత్రను పదిమంది నాయకులతో వ్రాశాడు. కాని కాశీమజిలీ కథల్లో ఇరవై మంది నాయకులతోటి నారదుని కథ అపూర్వంగా మనకు కనిపిస్తుంది. ఈ కథలన్నీ ఒక్క కథ-ఒక్క ఇతివృత్తం అనే పద్ధతిలో ఉండవు. ఒక కథలో మరో కథ-దానిలో మరో కథ అన్నట్లుగా గొలుసుకట్టు కథల్లాగా ఉంటాయి. ఇట్లాంటి విశేష ఉత్కంఠభరిత కథలను గూర్చి వివరంగా కాశీమజిలీ కథల ధారావాహిక- మూడో భాగం నుండి తెలుసుకుందాం.

(సశేషం)

# బ్రహ్మఖండం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



వేదవ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలలో స్కాంద పురాణం ఒకటి. ఎనభైఎనిమిది వేల ఒక వంద శ్లోకములతో కూడిన ఈ పురాణం పురాణాలలోకెల్లా అతి పెద్దది.
ఈ పురాణం మహేశ్వర, వైష్ణవ, బ్రహ్మ, కాశీ, అవంత్య, నగర మరియు ప్రభాస అనే ఏడు (7) ఖండాలుగా విభజింపబడింది. అందులో మూడవ భాగమైన 'బ్రహ్మ ఖండం' మూడు ఉపఖండాలుగా విభజింపబడింది.
ఇదివరలో మన చైతన్యం సంకల్పబలం పత్రికా పాఠకులకు 'కాశీ ఖండం' అందించిన ప్రముఖ రచయిత శ్రీ పోచనపెద్ది వేంకట మురళీకృష్ణ గారు ఇప్పుడు 'బ్రహ్మఖండం' సమర్పిస్తున్నారు.
పాఠకులు ఈ పురాణ పఠన సదవకాశాన్ని వినియోగించుకుని ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాము.

-ఎడిటర్

## 22. వ. అధ్యాయం.

## అగ్ని తీర్థ ప్రశంస.

దుష్పణ్యుడు అరణ్యంలో తిరుగుతూ ఉగ్రశ్రవుని కుమారుని నీటిలో ముంచి సంహరించాడు. ఈ విషయం తెలుసుకొని ఉగ్రశ్రవుడు " పిశాచవై తిరగమని" దుష్పణ్యుని శపించాడు. ఆనాటినుండి దుష్పణ్యుడు పిశాచిగా ఆరణ్యంలో తిరుగుతూ అగస్త్యాశ్రమం దగ్గరకు వచ్చాడు. " ఓ తపోధనులారా! నన్ను అనుగ్రహించండి. దుష్పణ్యుడను పేరుగల వైశ్యుడను. అనేక మంది పిల్లలను సంహరించాను. ఉగ్రశ్రవుని కుమారుని సంహరించాను. పిశాచమవ్వమని శపించారు. ఈ జన్మనుండి విముక్తి కలిగించండి" అని ప్రార్థించాడు. అగస్త్యుడు కరుణించి తన శిష్యుని

పిలిచి “ సుతీక్ష్ణణా! నీవు అగ్ని తీర్థానికి వెళ్ళి, ఈ పిశాచం కోసం స్నానం చేయి. పిశాచత్వాన్ని విడిచిపెడతాడు. “అని చెప్పాడు. సుతీక్ష్ణుడు అగ్ని తీర్థానికి వెళ్లి, సంకల్ప పూర్వకంగా స్నానంచేసి, రామనాధాది తీర్థాలు సేవించి, ఆతీర్థాన్ని తీసుకు వచ్చి అగస్త్యునికి ఇచ్చాడు. అగస్త్యుడు ఆతీర్థాన్ని పిశాచం మీద జల్లారు. అగ్ని తీర్థం ప్రభావం వలన దుష్పణ్యుడు పిశాచత్వాన్ని విడిచిపెట్టి, దివ్యత్వాన్ని పొందాడు. అందరికి నమస్కరించి స్వర్గానికి వెళ్ళిపోయాడు.




ఈ అధ్యాయాన్ని చదివినవారు,విన్నవారు పాపాలనుండి విముక్తి పొంది, భోగాలు అనుభ విస్తారు. స్కాంద పురాణం లోని బ్రహ్మ ఖండంలోని, సేతు మాహాత్మ్యంలోని “ అగ్ని తీర్థ ప్రశంస”అను ఇరవై రెండవ అధ్యాయం సమాప్తం.

(ఇంకా ఉంది)

---

# కొడకా ! జర భద్రం



చివటం సుబ్బారావు

(పెనుగొండ)

కొడకా ! జర భద్రం
ఇన్నాళ్ళూ నువ్వు ఆఫీస్ కి ఎలా వెళ్ళావో
ఎలా వచ్చావో పట్టించుకోలేదు
కానీ!..
రోజులు మారాయి కాబట్టి
మనుషులు కూడా మారుతారు
సర్దుబాటు చేసుకో
ఇబ్బంది పడినా పర్వాలేదు
గౌరవం ఇచ్చినట్లుంటాది అవసరమైతే
లేచి నిలబడు
ఇదివరకట్లా కూర్చుని సమాధానం చెబితే
కుళ్ళబొడిచేత్తారు

ఆ..పై దేవుడు కూడా
నిన్ను కాపాడ లేడు బిడ్డా!
ఎదురు సమాధానం చెప్పకు
ఆగష్టు పదిహేను నుంచి
పథకం ప్రకటించింది ప్రభుత్వం
మిలట్రీవోడి చేతిల్లో తుపాకీలా
ప్రతీ ఆమె చేతిల్లో అప్పడాల
కర్రుంటాది
అది మర్చిపోవద్దు
తరువాత కాకి బట్టలేసుకున్న
కండక్టర్ కూడా నిన్ను రక్షించలేడు
ఎందుకంటే తనకీ రక్షణ లేదు కాబట్టి

# జ్ఞాపకాల దొంతరలో



ఎలక్ట్రాన్

(గత సంచిక తరువాయి)

సిలిగురి ప్రాంతంలో బంగ్లాదేశ్ ఉత్తరభాగమూ, నేపాల్ దేశానికి చెందిన చుంబి వ్యాలీ దక్షిణభాగమూ భారత్ భూభాగంలో చొచ్చుకొని ఉంటాయి.

ఆ రెండు సరిహద్దుల నడుమనున్న నడవ వెడల్పు ఓ 40 కిలోమీటర్లు. దరిదాపులుగా అదే పొడవు కూడా ఉంటుంది. కేవలం ఈ నడవద్వారానే (యుద్ధపరిభాషలో చికెన్ నెక్ అంటారు) ఈశాన్యరాష్ట్రాలు భారతదేశ ప్రధానభాగంతో కలుస్తాయి. చైనీయులు ఈ నడవను ఆక్రమించి ఈశాన్యరాష్ట్రాలను భారత్ నుంచి వేరు చేసే లక్ష్యంగా చొరబడ సాగారు.

హడావుడిగా రెండు రోజుల్లో బ్రహ్మపుత్ర బ్రిడ్జికి లేత నీలిరంగు పూసి కేమఫ్లోజ్ చెయ్యడం జరిగింది. మా సంస్థ తాలూకు యంత్రసామగ్రినంతా వడివడిగా లోబెడ్ గూడ్స్ రైల్వే వ్యాగన్ల మీద పెట్టి, బీహార్లోని ఓ స్థావరానికి తరలింపజేయడం జరిగింది. మా సంస్థ తాలూకు వివిధ సాంకేతిక, భూభౌతిక, భూగర్భ సమాచార శాస్త్రపత్రాలని కూడా స్థావరంనుంచి బయటకి తరలించారు. మాకందరికి ఊపిరిసలపని పని తగిలింది. అంతలో కలలోంచి బయటపడ్డ నెహ్రూ రేడియో ప్రసారం చేస్తూ, దిగుమతిచేసుకొన్న ఖరీదైన యంత్రసామగ్రిని రక్షించుకోవాలని, అస్సాం నివాసప్రజల పట్ల తన సానుభూతిని తెలుపుతున్నాని వాపోయాడు. ఈ ప్రకటన విన్న తర్వాత ఈశాన్యరాష్ట్రాలలోని వ్యాపారాలను గుప్పిట్లో పెట్టుకొన్న కొందరు మార్వాడీలు, మరికొంతమంది ప్రభుత్వోద్యోగులు పలాయనం చిత్తగించారు. అప్పుడు స్థానిక ప్రజలు ఆందోళన చెందారు. మనుషులకన్నా మీకు యంత్రాలు ముఖ్యమా అని నెహ్రూపై విరుచుకు పడ్డారు. కొంతమంది మా సంస్థ ఉద్యోగులు తన్నులు తిన్నారు.

అంతటి హడావుడిలోనూ మేం ఓ పదిమంది కుటుంబాలతో సహా నిశ్చింతగా శివసాగర్ లోనే ఉండిపోయాం. కొంతమంది స్థానికులు, మరికొందరు సహోద్యోగులూ మీరెందుకు కదలటల్లేదని ప్రశ్నించకపోలేదు."ఈ రాష్ట్రానికి చెందని మాకు/మనకి వదిలి వెళ్లిపోవడానికి ఆస్కారముంది. అయితే మన దేశానికే చెందిన మీ/ఈ రాష్ట్రప్రజలందరూ ఎక్కడికి పోతారు? స్థానికులకు నైతిక బలం ఇవ్వడం మా/మన బాధ్యత. ఐక్యతను చూపడం మా/మన ధర్మం" అని సమాధానం చెప్పాం.

అయితే నవంబరు 62 లోనే చైనీయులు అనూహ్యంగా తామంతట తాముగానే మరి ముందడుగు వేయకుండా వెనుదిరిగి వెళ్ళిపోయారు.

(సశేషం)

# కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు

ముడుంబై వేంకటాచార్యులు

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు --10వ భాగం



తిరుమల కొండ పై నున్న ఏజంతువైనా దేవతాస్వరూపాలుగా పెద్దలు చెబుతారు. సగాన స్వామి కొండ మీద ఉన్న చీమల అదృష్టాన్ని మనం పాడు చేయరాదని ఆ ప్రసాదం ముట్టు కోకుండా పొట్లం ఎలా ఉందో అలా గే కట్టి తిరిగి కొండ పైకి తీసుకుని వెళ్ళి అక్కడ వదిలి పెట్టారు.అలగే ఒక సారి తనను పాము కరిస్తే చుట్టు ప్రక్కల ఉన్న వారు అంతా మంత్రం వేయించు కోమని లేదా వైద్యుడు చెంతకు వెళ్ళమని పట్టు పట్టారు. అనంతాళ్వాన్ అందుకు అంగీకరించ లేదు. ఒక వేళ నేను మరణిస్తే విరజానదిలో స్నానం చేసి వైకుంఠ నాథుని సేవించు కుంటూ ఉంటా.ఒక వేళ ,బ్రతికే ఉంటే స్వామి పుష్కరిణిలో స్నానం చేసి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని నిత్యం సేవించు కుంటూ ఉంటా నాకు రెండు విధాలా లాభమే అన్నారు.

రామానుజుల వారి శిష్యులు కొంతమంది వారి చెంత నుండి వారి అను మతి తో తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించాలని ఆయన అనుమతితో నడిచి బయలు దేరారు.

. .వారికి.ఏమీ బయట తినడం అలవాటు లేని కారణంగా కొన్ని రోజుల నుండి ఆహారం లేదు. నడక ద్వారా తిరుమల కొండ ఎక్కుతూ చాలా నీరసం గా ఉండి కొండ ఎక్కలేక నీరసంతో కూర్చుండి పోయారు. ఆసమయం లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆభక్తులను గమనించి రూపం మార్చుకుని అనంతాళ్వాన్ శిష్యునిగా లడ్డూలు ,చక్రపొంగలి, పులిహోర దద్దోజనం వంటి ప్రసాదములు , మంచి నీళ్ళు తీసుకొని వచ్చి వారికి అందించాలని ప్రయత్నిస్తే వారు చాలా ఆకలితో ఉండీ కూడా నీవు ఎవరు? మీ గురువు గారు ఎవరు? మీరు ఎవరు ఎవరు పంపితే వచ్చారు ? అని ప్రశ్నించారు . దానికి శ్రీ వైష్ణవ స్వామి స్వ రూపం లో నున్న స్వామి నేను రామానుజులు వారి శిష్యులు. అయిన అనంతాళ్వారన్ శిష్యుణ్ణి. అంటే వారు అనంతాళ్వార్ "తనయ"(శ్లోకం) చెప్పమన్నారు.స్వామి రెండు చేతులు జోడించి నమస్కరించి కళ్ళు మూసుకుని అనంతాళ్వాన్ తనయ చెప్పారు. అది విని .వారిలో వారు ఎంతో ఆశ్చర్యం తో మనం వస్తున్నట్లు అనంతాళ్వార్ కు ఎలా తెలిసిందో కదా అంతా ఆ పరమాత్మ దయ అనుకుని స్వామి వారి ప్రసాదం , మంచినీరు తృప్తి గా తీసుకుని వారంతా మా ప్రాణాలు నిలబెట్టారు స్వామి అన్నారు. దానికి స్వామి మా గురువుగారు ఆదేశించారు గాన దాసుడు మీ చెంతకు రావడం జరిగింది.మా స్వామి వారు నాకు కొండ పైన ఇంకో పని చెప్పారు.

నేను నడుస్తాను మీరు కాసేపు విశ్రాంతి తీసుకుని మెల్లగా రావచ్చుఅన్నారు. మాకు ఓపిక వచ్చేసింది మేము కూడా నీతో నే వస్తామని వారు బయలు దేరి కొండ పైకి చేరి నారు. వారికి అనంతాళ్వాన్ ఇల్లు చూపించి అదే ఇల్లు మీరు వెళ్ళండి . అంటూ నాకు మా గురువుగారు చిన్న పని చెప్పారు ఆపని చూసుకుని వస్తాను మీరు నడవండి అని వారిని పంపేశారు.

(ఇంకా ఉంది)

# యాదగిరి గుట్ట



డా॥ కె.రామానందం



పురాణాలలో అభివర్ణించిన ప్రాచీనక్షేత్రం. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి సుమారు అరవై కిలోమీటర్ల దూరంలోనే ఉండటంవల్ల, విశాలమైన గిరిపై ఆహ్లాదకరమైన వాతావరణంలో నెలకొని భక్త కోటిని ఎంతగానో ఆకర్షిస్తున్న క్షేత్రం యాదగిరిగుట్ట. ఉగ్ర నరసింహుడు ప్రసన్నాకృతిలో వెలసిన దివ్యక్షేత్రం. ఏడాది పొడువునా యాత్రికుల రద్దీతో ఉండే క్షేత్రం. ఇచ్చట అర్చారూపంలో వేంచేసి, స్వామివారు భక్తులను అనుగ్రహిస్తూ వారి అనారోగ్య సమస్యలు నయం చేసి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చుతారని భక్తుల ప్రగాఢ నమ్మకం.

ఆపదమొక్కులవాడుగా, తెలంగాణా రాష్ట్ర భక్తజనులను, తన వద్దకు ఆకర్షించుకోవడం, ఉద్యోగులను, వ్యాపారులను పెద్ద సంఖ్యలో ప్రభావితం చేస్తూ నిత్యం, ముఖ్యంగా వారాంతపు సెలవుల్లో శరణాగతిగా తన క్షేత్రానికి రప్పించుకోవడం ఈ స్వామికే చెల్లింది. పరమ భక్తుడు, పసివాడు అయిన ప్రహ్లాదుడ్ని కాపాడడానికి ఉగ్రనరసింహమూర్తిగా అవతారమెత్తిన స్వామి, మరో భక్తుని కోరిక మేరకు ప్రసన్న రూపంలో లక్ష్మీ సమేతంగా కొలువుతీరిన యాదగిరిగుట్ట, తెలంగాణా తిరుపతిగా ప్రాశస్త్యం పొందిన ఈ క్షేత్రానికి ఉన్న విశిష్టత ఎంతగానో పెరిగింది.

వేదవ్యాసముని ప్రణీతమైన శ్రీ నరసింహ పురాణంలో, స్కాంద, బ్రహ్మాండ పురాణాలలో ఈ క్షేత్ర ప్రస్తావన ఉంది. మహా జ్ఞాని విభాండకుడి కుమారుడు ఋష్యశృంగుడు. అతని పుత్రుడు యాద ఋషి. ఆయన చిన్నతనం నుంచీ విష్ణు భక్తుడు. ఆయనకు నృసింహుని పట్ల ఎనలేని మక్కువ. ఆయనను నృసింహ స్వరూపంలో సందర్శించాలని ప్రగాఢమైన ఆకాంక్ష ఉన్నది.

తన మనోరథ సిద్ధికి ఎంతో భక్తి ప్రపత్తులతో అనేక ప్రదేశాలు సంచరించి, మంత్రానుష్ఠానానికి, తత్సిద్ధికే తగిన ప్రశాంతమైన రమణీయమైన స్థలం కోసం అన్వేషిస్తూ దక్షిణ భారత ప్రాంతం చేరాడు. అక్కడ అడవులలో తిరుగుతూ కొండజాతి వారికి చిక్కాడు. వాళ్ళు యాదర్షుని క్షుద్ర దేవతకు బలివ్వబోయారు. అప్పుడు రామబంటుగా హనుమంతుడు ప్రత్యక్షమై యాదర్షిని రక్షించి, కీకారణ్యంలో సింహగిరి గుట్టలున్నాయనీ, అక్కడికి వెళ్లి సాధన చేస్తే స్వామి సాక్షాత్కరిస్తాడని సూచించాడు. అక్కడే ఉన్న కొండపై శ్రీ లక్ష్మీ నరసింహుడు అర్చా రూపంలో వెలసి ఉన్నాడని సత్యాన్ని చెప్పాడు.



యాదర్షి దీర్ఘకాల తపస్సు ఫలించింది. నృసింహ స్వామి వారు ప్రత్యక్షమయ్యారు. అయితే ఆ ఉగ్ర నరసింహ రూపాన్ని దర్శించలేకపోయాడు. భక్తుని కోరిక మేరకు స్వామివారు శాంతస్వరూపంలో శ్రీ లక్ష్మీ సమేత నరసింహునిగా ప్రత్యక్షమయ్యారు. అనంతరం యాదరుషి స్వామిని వేరువేరు రూపాల్లో చూడాలని ఉందని వరం కోరుకున్నాడు. దాంతో జ్వాల, గండభేరుండ, యోగానంద, ఉగ్రసింహ, లక్ష్మీ నృసింహస్వామిగా ప్రత్యక్షమయ్యాడు మహావిష్ణువు. అందుకే ఈ ఆలయాన్ని పంచ నారసింహ క్షేత్రంగా పిలుస్తారు. ఇంతే కాక స్వామివారిని యాదగిరి పైనే అర్చా రూపంలో వేంచేసి ఉండవలసినదిగా అర్థించాడు. అందుకు నరసింహ స్వామి వారు అంగీకరించారు. యాదర్షి కోరిక ఫలితంగా వెలసింది కాబట్టి యాదగిరి గుట్ట గానూ ప్రసిద్ధమైనది. యాదర్షి కోరిక మీద ఆంజనేయ స్వామి వారు ఆలయ క్షేత్ర పాలకుడిగా ఉన్నాడు. యాదర్షిని తపస్సు చేసుకునే కాలంలో ఆయనను బలిజేయ తలపెట్టిన ఒక దౌత్యుని మహావిష్ణువు తన సుదర్శన చక్రాన్ని పంపి వానిని అంతమొందించాడట. ఇప్పటికీ గుట్ట చుట్టూ సుదర్శనం రక్షా కవచంలా నిలిచి ఉంటున్నదని భక్తులు విశ్వాసం. అదే ఆలయ గోపురం మీద ఉన్న దివ్య చక్రం.

పూర్వకాలంలో ఈ క్షేత్ర ప్రాంతమంతా వ్యాపించిన అడవి భక్తుల రాకపోకలకు అడ్డంకిగా నిలిచింది. ఒకరోజు స్వామివారు ఆ గుట్టకు దగ్గరలోని గ్రామాధికారికి కలలో ప్రత్యక్షమై తాను వేంచేసి ఉన్న గుహ గుర్తులు చెప్పి అంతర్ధానమైనట్లు చెబుతారు. మరునాడే ఆ గ్రామాధికారి గ్రామంలోని అందరిని పిలిపించి ఈ వృత్తాంతం చెప్పి, అనేక మందిని తోడుగా తీసుకుని, గిరి శిఖరం పైకి ఎక్కి అన్వేషించి, గుహలో నరసింహుని స్వరూపాన్ని తిలకించారట. అప్పటినుంచి ఆ అధికారి స్వామివారికి నిత్య పూజలు జరపడానికి శ్రీ వైష్ణవులని నియామకం చేశాడట. గత 150 సం॥ల లోనే కాలిబాట

వచ్చింది. కాలక్రమేణా భక్తుల సౌకర్యార్థం పక్కా ఘాటీ రోడ్డు, అనేక వసతి గృహాలు ఏర్పాటు అయ్యాయి.

యాదాద్రిలో గుట్ట మీదే కాకుండా కింద కూడా మరో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఉంది. నిజానికి స్వామివారు ముందు ఈ పాత ఆలయం-లోనే వెలిసారని తరువాత కొత్త నరసింహ స్వామి వారి ఆల-యానికి గుర్రం మీద వెళ్లే-వారనేది మరో కథనం. క్రింది ఆలయం నుంచి పై ఆలయం వరకు మెట్ల మీద ఇప్పటికీ కనిపించే గుర్రపు పాదముద్ర-లు అవేనంటారు.

ఎంతో పురాతనమైన ఈ ఆలయ చరిత్రను శాసనాల దృష్ట్యా చూస్తే క్రీ॥శ 1148 వ సం॥ నాటి త్రిభువన మల్లుడు యాదగిరి శిఖరాగ్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని తులసి దళాలతో ఆరాధిం-చిన ఫలితంగా గుజరాత్ నాయకుని ఓడిరచినట్టు కొ-లనుపాక లోని ఒక శాసనం స్పష్టం చేస్తుంది. యాదగిరికి సమీపంలోని భువనగిరి వద్ద ఏకశిలపై రాజమహేంద్రవరా-నికి చెందిన త్రిభువనమల్లు-డు పెద్ద కోటను నిర్మించాడు. ఈనాటికీ ఆయన పేరునే ఆ గ్రామాన్ని 'భువనగిరి' అని పి-లుస్తున్నారు. త్రిభువనమల్లు-నికి గుజరాతు రాజైన పృధ్వీ వల్లభునితో పదహారు పర్యా-యాలు పోరాటం జరిగింది. కాని విజయం సాధించలే-కపోయాడు. అప్పుడు తన సచివుడైన జనద్దేవుని ప్రేరణ చేత యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామిని సేవించి విజయం సా-ధించినట్లు కథనం.

అలాగే క్రీ॥శ 16వ శతాబ్దంలో విజయనగర చక్రవర్తి శ్రీకృ-ష్ణదేవరాయలు ఆంధ్రదేశం-లో పర్యటిస్తూ యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి మహత్యం విని ఆ స్వామిని సేవించి ఆరా-ధించినట్టు చరిత్ర చెబుతుంది.

యాదాద్రి గుట్టలోని విష్ణు పు-ష్కరిణి సాక్షాత్తూ బ్రహ్మ కడిగిన పాదాల నుంచే ఉద్భవించింది అంటారు. అనారోగ్యం, ఇతర గ్రహ సమస్యలు ఉన్నవారు ఈ పుష్కరిణిలో స్నానం చేసి స్వామిని సేవిస్తే తమ బాధల నుండి విముక్తులవుతారనేది భక్తుల నమ్మకం. గుట్ట మీద ఆలయానికి మెట్ల మార్గంలో వె-ళ్ళేటప్పుడు దారిలో శివాలయం కనిపిస్తుంది. ఇక్కడి శివుడు నరసింహ స్వామి కన్నా ముందే స్వయంభుగా వెలిశాడట. ఈ మెట్లు ఎక్కి స్వామి వారిని సేవించిన వారికి కీళ్ళ నొప్పులు తగ్గుతాయనేది మరో విశ్వాసం.

ఆలయ విశేషాలు:

నరసింహ స్వామివారి పూజా కార్యక్రమాలు నిష్ఠగా పాంచ-రాత్రాగమం ప్రకారం అర్చకులు సుప్రభాత సేవ నుండి ఏకాంత సేవ వరకు నిర్వహిస్తున్నారు. ఈ పుణ్యస్థలిలో నిత్యోత్సవాలు, అధ్యయనోత్సవాలు, ఆళ్వారుల తిరు నక్షత్ర మహోత్సవాలు, వార్షిక బ్రహ్మోత్సవాలు వంటి అనేక వేడుకలు నిర్వహిస్తారు. ఇచ్చట ఫాల్గుణ శుద్ధ విదియ నుంచి ద్వాదశి వరకు బ్రహ్మో-త్సవములు ఘనంగా నిర్వహి-స్తుంటారు. భక్తులు ఈ ఉత్స-వాలలో పాల్గొనుటకు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి అనుగ్రహం పొందుతారు.

బ్రహ్మోత్సవ వైభవం:

యాదాద్రి ఆలయంలో బ్రహ్మ-దేవుడు పేరిట ఆ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహి-స్తారు. అందుకే ఈ వేడుకలు బ్రహ్మోత్సవాలు అని వ్యవహరి-స్తారు. పదకొండు రోజులపాటు ఆగమ శాస్త్ర ప్రకారం ధ్వజారో-హణం నుండి శృంగార డోలో-త్సవం వరకు అన్ని కైంకర్యాలు జరుపుతారు. ఈ ఉత్సవాలలో ఎదుర్కోలు మహోత్సవం, తిరు కళ్యాణ మహోత్సవం, దివ్య విమాన రథోత్సవం ఉంటాయి. ఉత్సవాల 8వ రోజున శ్రీ స్వామి, అమ్మవార్ల వార్షిక తిరుకళ్యా-ణం, ఉదయం పూట బా-లాలయంలో నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం ఇదే కళ్యాణోత్సవం మరోసారి జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో సాయంత్రం వేళ భక్తుల సమ-

క్షంలో 7 గం॥లకు నిర్వహిస్తా-రు. తెలంగాణా ప్రభుత్వ పక్షాన రాష్ట్రం ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు, ముత్యాలు, తలంబ్రా-లు సమర్పిస్తారు. మరునాడు నిర్వహించే రథోత్సవం కన్నుల పండుగగా ఉంటుంది. బ్ర-హ్మోత్సవం ఆఖరి రోజున జరిగే చక్రస్నాన ఘట్టంలో మరియు శృంగార డోలోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పా-ల్గొనడం ఆనవాయి. ఉత్సవా-లు జరిగిన పదకొండు రోజులూ యాదగిరి ముక్కోటి దేవతల విడిదిల్లుగా మారుతుంది. ఆ సందర్భంగా సకల దేవతల్ని శాస్త్రోక్తంగా ఆహ్వానించి, వేదో-క్తంగా పూజలు ఆలయ అర్చ-కులు నిర్వహిస్తారు.

యాదాద్రిలో నిత్యం శ్రీ సత్య-నారాయణస్వామి వ్రతాలు జరుపుతారు. వ్రతాలు ఉ. 7:15 నిమిషాల నుంచి రాత్రి 9 గం॥ల వరకు వివిధ నిర్దిష్ట వేళల్లో ని-ర్వహిస్తుండడం ఒక విశేషం. ఇవి కాక భక్తులు మొక్కులు సమర్పించుకోవడం, కర్ణ వేదనలు, నామకరణ మహో-త్సవాలు, పెండ్లిళ్ళు చేసుకోవ-డం, కొత్త వాహనాలకు పూజ చేసుకోవడం పరిపాటి. భక్తుల సౌకర్యార్థం అన్నదానం రోజూ చేస్తారు. దేవస్థానం ప్రసాద విక్రయ కౌంటర్లలో పులిహార, దధ్యోజనం, లడ్డు, వడ, మిశ్రి వగైరాలను విక్రయిం-




చే ఏర్పాటు చేశారు. కొండపైన కొండ క్రింద కుళాయిలు అమర్చి రక్షిత మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నది.

గిరి ప్రదక్షిణం:

యాదాద్రి గిరి ప్రదక్షిణ అపూ-ర్వంగా జరుపుతుంటారు. ప్రతి మాసంలో నృసింహుని జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున భక్తులు యాదాద్రి గిరి ప్రద-క్షిణ చేస్తుంటారు. సుమారు ఆరు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ ప్రదక్షిణ క్రమంలోనే భక్తులు పంచ నారసింహులను దర్శించి పునీతులు అవుతారు. ఇలా చేయడం వల్ల సర్వ కార్య-సిద్ధి, రోగ నివారణ, సత్సంతాన ప్రాప్తి కలుగుతుందని విశ్వసి-స్తారు.

తెలంగాణ రాష్ట్ర మాజీ ము-ఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర రావు గారు తీసుకున్న మం-త్రివర్గ నిర్ణయంతో యాదగిరి ఆలయ రూపురేఖలు పూర్తిగా మార్చి వేశారు. మహా దివ్య క్షే-త్రంగా తీర్చిదిద్దేందుకు 2,000 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన-వనాలు, కాటేజీలు, కళ్యాణ మండపాలు, విశాలమైన రహ-దారులు, వీఐపీ అతిథిగృహా-లు, మ్యూజియములు, విలా-సవంతమైన హోటల్స్ నిర్మించి నూతన శోభ చేకూర్చారు. ప్ర-స్తుతం అర ఎకరంలో ఉన్న ప్రధాన ఆలయ స్థానంలో 2.33 ఎకరాల విస్తీర్ణంలో కొత్త ఆల-యాన్ని అత్యంత విశాలంగా, సుందరంగా నిర్మించారు. యాత్రికులకు ఉచిత బస్సు సౌకర్యం కలుగజేశారు. భక్తు-లను స్వామివారి సందర్శనకు క్యూ లైన్ లో పంపించి అన్ని ఆలయంలోని దేవతామూ-ర్తులు చూసుకుని బయటకు నిష్క్రమించేలా చక్కటి సదు-పాయాలు కలిగించారు. కొండ దిగువన నూతన సత్రము-లు, పెద్ద హోటళ్ళు, పెద్దపెద్ద వాణిజ్య కేంద్రాలు వెలిసాయి. పునరుద్ధరించిపడిన యాదా-ద్రిని చూసి అందరం తరిద్దాం.

# చైతన్యరూపిణియే అమ్మ



డాక్టర్ . చిలకమర్తి దుర్గాప్రసాదరావు.

సాధారణంగా 'అమ్మ' ఎలా పిలిచినా పలుకుతుంది. అమ్మా! అని పిలిచినా పలుకుతుంది . ఒసేయ్! అన్నా పలుకుతుంది, ఏమే! అన్నా పలుకుతుంది. నోరు తెరిస్తే 'అ' , నోరు మూసుకుంటే 'మ' . అందుకే సమస్త పదజాలం 'అమ్మ' పదంలోనే ఇమిడి ఉంది. అందుకే ఎలా పిలిచినా పలుకుతుంది. మన తల్లే మనం ఏవిధంగా పిలిస్తే ఆ విధంగా పలికేటప్పుడు, ఇక జగన్మాత పలుకకుండా ఉంటుందా! తప్పకుండా పలుకుతుంది. కాని సాధకునికి ఆమె అసలైన స్వరూపం, పేరు కూడ తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది .

ఇక నేను చిన్నప్పుడు లలితాసహస్రం చదువుతూ ఉండేవాణ్ణి. అంతా బాగానే ఉండేది కానీ 'అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా' అనే నామానికి మాత్రం అర్థం సరిగా తెలిసేది కాదు . కొంతకాలం తరువాత ఆ మాటకు అర్థం తెలిసింది.

మనం 'లలితాసహస్ర' నామాలను పూర్తిగా పరిశీలిస్తే సుమారు మొదటి మూడు వందల నామాలు ఆమె ఆధిభౌతిక స్వరూపాన్ని , ఆ తరువాత సుమారు మూడు వందల నామాలు, ఆమె ఆధిదైవిక స్వరూపాన్ని ఆ తరువాత గల నామాలు ఆమె యొక్క ఆధ్యాత్మికస్వరూపాన్ని వర్ణించేవిగా నాకు అనిపిస్తుంది . ఆమె లోకోత్తరసౌందర్యం , లోకాతీత శక్తులు, అలా ఉంచితే ఆమె అసలు స్వరూపం ఏమిటో మనకు తెలుస్తుంది . ఆమెను ఆత్మ స్వరూపిణిగా మనం ఆరాధించాలని ఆమె భావన . అందుకే అంతర్ముఖ సమారాధ్యా; బహిర్ముఖ సుదుర్లభా అన్నారేమో!

ఆత్మ దేశకాలాలకు అతీతమైనది . కాని అది శరీరంతో కూడి ఉండడం వల్ల పరిచ్ఛిన్నంగా కనిపించి మనకు జీవత్వ భ్రాంతిని కల్పిస్తోంది. కాబట్టి ఆత్మ యొక్క యథార్థస్వరూపాన్ని గుర్తించాలంటే దానిని ఆవరించియున్న శరీరాలు, కోశాలు, లోపలున్న ఆరు చక్రాలు గురించి స్పష్టంగా తెలుసుకోవడం అవసరం .

ఈ ఆత్మ అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయమనే ఐదు కోశాలతోను; స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం అనే మూడు శరీరాలతోను ఆవరించబడి ఉంది. కాని ఆత్మకు వీటితో ఎటువంటి సంబంధం లేదు.

మొదటిది అన్నమయకోశం : ఇది పంచభూతాలతో నిర్మించబడింది. మనం తిన్న ఆహారంతో ఈ అన్నమయకోశం ఏర్పడుతుంది. మనకు పైకి కనిపించే ఈ శరీరమే అన్నమయ కోశం .

రెండోది ప్రాణమయకోశం: మనకు కనిపించే ఈ అన్నమయకోశం లోపల ప్రాణమయ కోశం ఉంటుంది . ఇది ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం అనే ఐదు వాయువులతోను ; నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయమనే ఐదు ఉపవాయువులతోను కూడి ఉంటుంది . ప్రాణం హృదయంలోను , అపానం గుదస్థానంలోను. సమానం బొడ్డులోను, ఉదానం కంఠంలోను, వ్యానం శరీరమంతటను వ్యాపించి ఉంటాయి.

హృది ప్రాణ: గుదేఽపాన: సమానో నాభిమండలే

ఉదాన: కంఠదేశస్థ: వ్యాన: సర్వశరీరగ: అని శాస్త్రకారులు పేర్కొన్నారు. ఇక వాటితోపాటు నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయమనే ఉపవాయువులు కూడ ఉంటాయి. నాగం అనే వాయువు ముక్కులో ఉంటుంది . కూర్మం కంటి రెప్పలలో ఉంటుంది. కృకరం నేత్రవలయంలోను , దేవదత్తం కంఠద్వారమందు, ధనంజయం శరీరమంతటను నిండి ఉంటాయి.

(సశేషం)

# మధుర స్వప్నం

ఉషారాం




(గత సంచిక తరువాయి)

నువ్వు ఈ రోజుల్లో పిల్లవి కాదే పిల్లా , జడ వేసుకుని బొట్టు పెట్టుకుని, లక్ష్మీదేవి లాగా ఉన్నావు. నిన్ను చూస్తుంటే ముచ్చటేస్తోంది, గోరింటాకు తెప్పిస్తాను. రేపు పెట్టుకుంటావా అన్నారు. తనకి చాలా సిగ్గుగా అనిపించింది
ఆవిడ ప్రవర్తన. ఆ వెండి చూస్తే తనకు మామ్మ గుర్తొచ్చింది. ఆవిడ ఇలాగే అనేది.
శ్యామ్ రాగానే దాన్ని చూస్తూ నవ్వు కోవడం గమనించింది . నూజివీడు రసాలు మామిడి పండ్లు తినమని పెట్టారు.
వసుధా, రాత్రి మేము పక్క ఊర్లో స్నేహితుడి ఇంటికి పెళ్ళికి వెళ్లి మూడు రోజులు ఉండి వస్తాము. ఇంట్లో రంగమ్మ ఉంటుంది. ఏం పని కావాలన్నా చేస్తుంది. పొద్దున్నే వచ్చి సాయంకాలం వెళుతుంది ఈ మూడు రోజులు మీ ఇష్టంగా ఉండండి. తర్వాత రెండు రోజులు ఇక్కడ ఉండి వెళ్ళదురుగాని అన్నారు. అలాగే అన్నాడు శ్యామ్. తనికిమటుకు ఎలాగో ఉంది. ఏం అనటానికి తోచటం లేదు. అమ్మమ్మ గారు వాళ్ళు ఏడు గంటలకు బయలుదేరి వెళ్ళిపోయారు. అమ్మమ్మగారు వంట చేసి, బెండకాయ వేయించి, కంది పొడి, మాగాయి , ఒకచోట పెట్టారు. మొహమాటం లేకుండా అన్ని తినండి అంటూ మరీ మరీ చెప్పి వెళ్లారు, కమ్మటి నెయ్యి,చిక్కటి మజ్జిగ, శ్యామ్, తను భోజనం చేసి, వంటిల్లు సర్ది వచ్చేటప్పటికి , దొడ్లో మంచం వాలుస్తూ కనిపించాడు. బొంత దుప్పటి తీసుకెళ్లి ఇచ్చిందితను. ఇంట్లోకి వస్తుంటే వద్దంటూ కాసేపు ఇక్కడ కబుర్లు చెప్పుకుందాం అన్నాడు. అవి వెన్నెల రాత్రులు కావడంతో చల్లని సుధా చంద్రికలు తమపై పడుతుంటే, పిల్ల గాలి నేనున్నానంటూ తమ తనువులు తడుముతోంది .మౌనంగా ఒకరినొకరు చూసుకుంటూ, మాలతీలు, జాజుల వాసనతో పరిమళిస్తున్న ప్రకృతి సౌందర్యం, తమలో కోరికను రేపుతుంటే పరవశిస్తూ, మధుర క్షణాలను ఆస్వాదించడం తమ జీవితంలో మరుపురాని అనుభవం.
వాళ్ళ ఆత్మీయత ప్రేమాభిమానాలు తను ఎప్పటికీ మరిచిపోలేదు. అలాగే వారు పనివారి పట్ల చూపే దయ, వారికి ఆహారాన్ని అందివ్వడం వారింట్లో శుభకార్యాలకి తమ వంతు సాయం చేయడం మొదలైనవి చూసినప్పుడు ప్రపంచంలో అంతా ఈ విధంగా ఉన్నప్పుడు శాంతి భద్రతలకు లోటు ఉండదు కదా అనిపించింది. తాము వస్తుంటే అమ్మమ్మ గారు బట్టలు పెట్టి తమ సొంత కూతురు అత్తారింటికి వెళ్లి పోయేటప్పుడు ఎలా ఉంటారో అలా ఉండడం తనకు మళ్లీ వాళ్ళ ఇంటికి ఎప్పుడు వస్తామో అనిపించింది. తిరిగి వచ్చాక కూడా వాళ్ల జ్ఞాపకాలు తన చుట్టూ తిరుగుతూనే ఉన్నాయి. మన జాతీయ గీతం సస్య శామలం, మలయజ శీతలం మొదలైన మాటలు నిజం అనిపించింది.
పట్టణ నాగరికతకు అలవాటు పడి కృత్రిమంగా, నాటకీ యంగా గడిపే ఈరోజుల్లో వాళ్ల నిజమైన నిజాయితీ వేష భాషలు ప్రేమలు చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. అక్కరలేని ఆడంబరాలు పై పైన చూపే డాంబికలు చాలా చిరాకును, తామేదో కోల్పోతున్న భావనను కలిగిస్తాయి. ఒకరోజు అమ్మమ్మ గారు దొడ్లు ఆరేసుకున్న మడి చీర కనిపించలేదు. ఆవిడ చాలా సేపు వెతుక్కుని మా పుట్టింటి వాళ్ళు పెట్టింది మంచి రంగు ఎవడో దొంగ వెధవ బావుందని పట్టుకుపోయి ఉంటాడు. అని అనుకుంటుంటే విన్న పాలేరు రంగయ్య రెండు రోజులు వెతికి ఒక దొంగను పట్టుకొచ్చాడు. అమ్మగారు ఇది మీ చీరేనేమో చూడండి అంటూ ఒక ఎర్ర రంగు పెద్ద అంచు చీర తీసుకొచ్చాడు. అవునంటూ అమ్మమ్మగారంతో ఆనందపడి ఆ దొంగతో వేరే అబ్బి ఇలా చేయొచ్చా అంటుంటే వాడు తప్పైపోయింది అమ్మ మా ఆడదానికి ఉన్న ఒక్క చీర చినిగిపోయిందని ఏడుస్తుంటే మీ చీర ఎత్తుకుపోయానండి.

(సశేషం)

# గజేంద్ర మోక్షము

ఆచార్య డా. శనగవరపు కృష్ణ మూర్తి శాస్త్రి



.

కరి మకరులు చేయంగ నచ్చెరువు నందు
చుండి  రతల కుతలములు చోద్యముగను
జలచరులు మకరికి ,వనచరులు కరికి
జయము గల్గు ననెడి జయ జయ ధ్వనులుగ --50

మారు మ్రోగె, విజృంభించి మకర రేడు
వివిధ విన్యాసముల కరిన్ బెగడు పరచు
కరి తన కర, దంత, పదపు ఘాతములకు
మకరిని భయబెట్టు తుదకు మకరి పట్టు --51

చేత కరిరాజు శక్తి శుష్కించ జొచ్చె
పెక్కు యేన్గులు తోడ్పడ విఫల యత్న
ములను జేసిరి, యాడు యేన్గులు భయంబు
నావరించ సరోవర మావల దరి --52

పైన కరి మకరుల పోరు పైన మంత
చూచు చుండి రశక్తులౌచు ,విధి తీర్పు
కొరకు వైచి యున్నారు దిగులు దిగులుగ
ఏ విధమున దీనిని గెల్తు? నెవ్వ రాదు --53

కొనెడి వేల్పుని జింతింతు? కొల్తు నెవరి?
రక్షకుండేడి? నాదు మొరనెవరు విను?
నన్ను కాపాడు నట్టి పుణ్యాత్ము లెవరు ?
యనుచు మత్త కరి  తలపోయంగ జొచ్చె  --54

దిక్కులను ధిక్కరించెడి ధీరు డగుచు
పత్నులు పది లక్షల కోట్లు పరగు చుండి
లెక్క లేనన్ని గజముల రేడు యైన
నక్కఱకు రాని చుట్టము లవియె గాద –55

చందనపు చెట్ల నీడల సౌఖ్యము విడి
బ్రతుకు తెరువను మోహపు పాశమందు
బంది యగుచు జీవుడు దేహ బలము నమ్మి
నీశు మఱచిజీవుడు నేను నేనె గొప్ప--56

యనుచు విఱ్ఱ వీగి నపుడు నవగతమగు
భీకరమగు మకరి పట్టు భీతి కలుగు
నధిక బలమున్న గజరాజు కగతి పట్టె
జీవ సత్తువ లన్నియు చెదిరి పోయె—57

తనకు మకరము నెదిరించు ధైర్య ముడిగె
కరికి గతజన్మ జ్ఞానంబు కలిగె నంత
వ్యర్ధమగు ప్రయత్నములకు స్వస్తి చెప్పి
దిక్కు లేని వారికి దిక్కు దేవు డనుచు -58

జగముల నెవరు సృష్టించు? జగముల లయ
మెవరు చేతురో? రెండింటి నెవరు సాక్షి
యగుచు పరగునో యా పరమాత్మ కావు
మని గజేంద్రుడు దీన స్వరంబు వేడె --59


పెక్కు రూపముల నెవరు వెలుగు చుండు ?
పెక్కు నామముల నెవరు పేరు బొందు ?
నామ రూపముల కతీత నాథు డెవరు?
సర్వ నామ రూపములందు  సర్వు డెవరు ?--60

గుణము లుండి లేనట్టి నిర్గుణుడు కలడ?
జగముల నెవరు సృష్టించు? జగముల లయ
మెవరు చేతురో? రెండింటి నెవరు సాక్షి
దేవతలు ఋషులు గొలచు దేవుడెవరు ?--61

(సశేషం )

# శ్రీకారం 2050....?

ఆచార్య కందాళం బదరీ కృష్ణకుమార్



(గత సంచిక తరువాయి)

"వీళ్ళు కట్టలేదు సార్. అదిగో తెల్ల పంచ , లాల్చీ, జారీ కండువా వేసుకొని పోడియం వైపు వస్తున్నాడే, అతను అందరి పన్ను కట్టాడు."

" అతను ఎందుకు కట్టడం?"

"ఇది ఎలక్షన్ మీటింగ్ సార్. అతను ముఖ్యమంత్రి కాండిడేట్. జనసమీకరణ కోసం . మీరు భారత దేశానికి వచ్చి చాలా సంవత్సరాలు అయినట్టుంది"

"ముప్పై సంత్సరాలు"

"అందుకే మీకు ఈ దేశ పరిస్థితి గురించి అవగాహన లేదు. మీరు తప్పక ఈ మీటింగ్ లో, ఏం చెప్తున్నారో వినాలి. కారు, ఇలా పక్కగా ఆపుతాను. కొంచం సేపు, విని వెళ్దాము" మీటింగ్ ప్లేస్ కనిపించేలా కారు ఆపుతో అన్నాడు డ్రైవర్.

..........

"ప్రియమైన సోదర సోదరీ మణులారా" గొంతు సవరించుకుని మాట్లాడసాగాడు పోడియం ముందున్న వ్యక్తి.

"పది సంవత్సరాలుగా ఎస్ .ఆర్ .వి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎంతగా నష్టపోయారో, ఎంతగా కష్టపడుతున్నారో చూస్తూనే ఉన్నాం. మా ఎస్.కె .సి పార్టీ, పరిపాలనలోకి వస్తే, మీ కష్టాలన్నీ గట్టెక్కుతాయి. మీరు ఇన్ని సంవత్సరాలుగా కడుతున్న రోడ్డు పన్నులు కట్టనవసరం లేకుండా చేస్తాము. ప్రభుత్వ రోడ్డు ఉపయోగించుకున్నదుకు ప్రభుత్వం మీకే ఎదురు పన్ను కడుతుంది. విద్యా సంస్థలలో మీరు మీ పిల్లలకి ఫీజులు కట్టడమే కాకుండా, ప్రభుత్వానికి కూడా పన్ను కడుతున్నారు, అది లేకుండా రద్దు చేస్తాం. మీ పిల్లలకి ఉచిత విద్యా సౌకర్యం కలిగించడమే కాకుండా మీ పిల్లల పేరున సంవత్సరానికి 25 వేల రూపాయిలు మీ బ్యాంక్ అకౌంట్లో వేస్తాము. ప్రభుత్వం వైద్యం పేరుతో వసూలు చేస్తున్న భారీ మొత్తాలను, పూర్తిగా రద్దు చేసి ఉచిత వైద్యా సౌకర్యం కలిపిస్తాము. ప్రైవేట్ స్కూల్స్, ప్రైవేట్ ఆస్పత్రులు లేకుండా చేస్తాము. మీరు ఇంక కుటుంబ నియంత్రణ పాటించనవసరం లేదు. ఎంతమంది పిల్లలు ఉన్నా ప్రభుత్వం ఒక్కొక్కరికి ఏడాదికి లక్ష రూపాయల చొప్పున బ్యాంకులో వేస్తుంది.

ఇంటికి ఒక కారు ఉచితంగా ఇస్తుంది. మీరు కారుకి టాక్స్ కట్టవలసిన అవసరం లేదు. మీ కారుకి జీవిత భీమా కూడా మా ప్రభుత్వమే కడుతుంది. ప్రజల సుఖ సంతోషాలే మా సుఖసంతోషాలు. అందుకే మా ఎస్. కె. సి పార్టీని గెలిపించండి, నన్ను ముఖ్యమంత్రిగా ఎన్నుకోండి, మీరు, మీ కుటుంబం చల్లగా సంతోషంగా ఉండండి. జై ఎస్ .కె .సి పార్టీ"

సభా ప్రాంగణం కరతాళధ్వనులతో మారుమోగిపోయింది.

"దేశానికి మంచి రోజులు వచ్చాయి అన్నమాట" , సంతోషంగా అన్నాడు, రామ్ .

"ఊరుకోండి సార్. ఈ నాయకుల మాటలు అన్నీ నమ్మితే గోదారిలో మునిగినట్లే. వారు చెప్పేవన్నీ బూటకాలు,నాటకాలు”

"మరి ఇంత డబ్బు ఖర్చు పెడుతున్నారు. వీళ్ళకి మాత్రం డబ్బు ఎక్కడిది"

"వాళ్ల బాబు సొమ్ము కాదు సార్. ప్రజల సొమ్ము. పది సంవత్సరాల క్రితం వీళ్ళ ప్రభుత్వం పాలనలో ఉండేది. అప్పుడు దోచుకున్న ప్రజల సొమ్మే, ఎన్నికల్లో ఖర్చు పెడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రజల ధనాన్ని పన్నుల రూపంలో దోచుకొని, రాబోయే ఎలక్షన్స్ లో వాడుకుంటుంది. అదే రాజకీయం సార్. ప్రజలు నిజం తెలుసుకోలేని మూర్ఖులు"

కొంచెం కోపంగా, కొంచెం కసిగా అన్నాడు, డ్రైవర్.
చిన్నగా నిట్టూర్చి, పద వెళ్దాం అని బయలుదేరాడు రామ్. దేశంలో జరిగిన, జరుగుతున్న పరిణామాలు చూసి, మనసులో ఎంతగానో బాధపడ్డాడు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత మళ్లీ ఏదో మీటింగ్ జరగటం కనిపించింది. ముందు మీటింగ్ కంటే ఇక్కడ పోలీస్ బందోబస్తు ఎక్కువగా ఉండటం గమనించాడు. ఇంతలో పోలీసులు టాక్సీని ఆపారు.
"టాక్సీని ఎందుకు ఆపారు" అని, అడిగాడు రామ్ .
"ఇది ముఖ్యమంత్రి ఎన్నికల మీటింగ్ సార్. ఆయన వచ్చి వెళ్లేంతవరకు ఇంకెవరు వెళ్ళటానికి వీలులేదు" అన్నాడు డ్రైవర్.
"సరే ఎలాగో ఆగం కదా, మీటింగ్ లో ముఖ్యమంత్రి ఏం చెప్తారో అది కూడా విందాం" అని కారు దిగాడు.
ముఖ్యమంత్రి పోడియం దగ్గరకు రాగానే జయ జయ నినాదాలు, కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి. అవి ఒక పక్క ప్రజలలో, నుంచి మాత్రం రావటం గమనించాడు. అతని మనసులో సందేహం పసి కట్టినట్లు డ్రైవర్, "వాళ్లు పార్టీ మనుషులు సార్" అన్నాడు. అనంతరం ముఖ్యమంత్రి అందరికీ నమస్కరిస్తూ "తండ్రులారా, తల్లుల్లారా, అన్నల్లారా, అక్కలారా, తమ్ముళ్ళారా, చెల్లెలారా, అందరికీ నా నమస్కారాలు. మీలో చాలామంది మా పార్టీ పై కోపంగా ఉన్నారని తెలుసు. మీ బాధ నేను అర్థం చేసుకోగలను. మీ దగ్గర నుండి పన్నుల రూపంలో ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నందుకు మాకు చాలా కష్టంగానే ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు కూడా వారిని ఉద్యోగాల నుండి తీసి వేసినందుకు కోపంగా ఉన్నారని మాకు తెలుసు. కానీ ఇదంతా ఎందుకు చేసేమో మీకు తెలియ పరచ వలసిన బాధ్యత మా మీద ఉంది. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక వారిని ఉద్యోగం నుంచి తీసివేసి రోబోలను పెట్టుకొని పని చేయించుకుంటున్నాము. ఏం చేయగలము చెప్పండి. రాష్ట్రం అప్పుల బారిలో కూరుకుపోయింది. ఇదంతా మా ముందు పాలించిన ఎస్. కే. సి పార్టీ చలవే. వారు చేసిన కోట్లకొద్ది అప్పులు, వడ్డీతో అంతకు పదిరెట్లు అయ్యి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశాయి. ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు. మీరు కట్టే పన్నులతోనే ప్రభుత్వం నడుస్తోంది. ఈ బాధలు ఇంకా ఎంతో కాలం ఉండవు. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా కొంచెం స్థిరపడుతున్నాము. మమ్మల్ని ఈ ఎలక్షన్స్ లో మళ్ళీ గెలిపిస్తే, రానున్న ఐదు సంవత్సరాలలో, ఈ ఆర్థిక సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని బయటపడవేస్తాం. మీరు పన్ను కట్టవలసిన అవసరం ఉండదు. ప్రభుత్వమే మీకు ఇంకా ఎన్నో సదుపాయాలు సమకూరుస్తుంది. ఇప్పుడు పెట్టుకున్న రోబోలను తీసివేసి మళ్లీ మీ ఉద్యోగాలు మీకు ఇస్తాము. ఎస్. కే. సీ. పార్టీ మాటలు నమ్మకండి. వారి చేతికి మళ్ళీ అధికారం ఇస్తే రాష్ట్రం ఇంకా అప్పుల పాలు అవుతుంది. మేము మాత్రమే మన రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించగలం. మమ్మల్ని నమ్మండి. నమ్మి ఓటు వేయండి. గెలిపించి చూడండి. మీ క్షేమమే మా క్షేమం . సర్వేజనా సుఖినోభవంతు. సెలవు" మళ్లీ ఒకసారి సభా ప్రాంగణమంతా జై జై నినాదాలతో, కరతాళధ్వనులతో మారుమోగిపోయింది. ముఖ్యమంత్రి పోడియం దిగి తన కారులో వెళ్ళిపోయాడు. డ్రైవర్ టాక్సీ స్టార్ట్ చేసాడు.
"నిజాయితీపరుడుగానే కనిపిస్తున్నాడు. పాపం ఆ పార్టీ వాళ్లు చేసిన తప్పులకు వీళ్ళు సమాధానం ఇచ్చుకోవాల్సి వస్తోంది"
"ఊరుకోండి సార్. వీళ్ళు నిజాయితీపరులు అంటే నవ్వు వస్తోంది. ప్రతిపక్ష పార్టీ వాళ్ళని నిందించటం, వారిని కారణంగా చూపించటం రాజకీయ పార్టీలకి అలవాటైపోయింది. అసలు ఈ స్థితి రాష్ట్రానికి రావటానికి కారణం ఈ ముఖ్యమంత్రి అతని పార్టీనే సార్."
"ఎలా?"
"ఐదు సంవత్సరాల క్రితం కూడా, వీళ్లే అధికారంలో ఉండేవాళ్ళు. మళ్ళీ ఎలక్షన్లో గెలవడానికి ప్రజల్ని ఆకర్షించే విధంగా ఎన్నో ఉచిత పథకాలు ప్రవేశపెట్టారు.

(సశేషం )

# జర్నలిస్టులపై సీఎం వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపణీయం

-వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్



జర్నలిస్టుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపణీయం,అభ్యంతరకరమై-నవని తెలంగాణ వర్కింగ్ జర్నలి-స్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) పేర్కొంది. ము-ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి పాత్రికేయుల పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షలు పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్,రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టులను పదే పదే తిట్టడం, అవమాన పర్చటం ఆయన హోదాకు తగనిదని,అసహనంతో

అహంకారపూరిత మాటలతో జర్నలిస్టులను బెదిరించడం భావ్యం కాదని అన్నారు. అ ఆ లు రాని వాడు పాత్రికేయుడు ఎలా అవుతారని, అలాంటి జర్నలిస్టులు సీఎం ప్రెస్ మీట్లకు ఎలా వెళతారని, జర్నలిస్టుల-ను లాగి చెంప మీద కొట్టడానికి వాళ్ళేమైనా సీఎం గుమస్తాలా?అని వారు ప్రశ్నించారు. సోషల్ మీడియా, యూటూబ్ చానళ్ళ వల్ల ఇవాళ జర్నలిస్టుల సంఖ్య పెరిగిందని, ప్రజలు, పాత్రికేయులు ప్రభుత్వాలను ప్రశ్నించే పరిస్థితులు పెరిగాయని, అంత మాత్రాన అధికారంలో ఉన్న పాలకులు అసహనంతో ఊగిపోతే ఎలా అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఒకరిద్దరు జర్నలిస్టులను దృష్టిలో పెట్టుకుని పదేపదే మొత్తం జర్నలిస్టులను ఉద్దేశించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని వారన్నారు. జర్నలిస్టుల పట్ల ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి బాధ్య-తలు చేపట్టిన ఏడాదిన్నరలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ఒక్క పథకం తీసుకురాకపోగా, కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని అన్నారు. తరుచూ మీడియా మీద విమర్శలు చేయడం, జర్నలిస్టులను తిట్టడం మాత్రం పెద్ద ఎత్తున చేస్తున్నారని అన్నారు.ముఖ్యమంత్రి స్థాయి సమా-వేశాలకు మీడియా పాసులు ఉన్న జర్నలిస్టులే వెలుతుంటారు.

ఇప్పటికే ముఖ్యమంత్రి బహిరంగ సభలకు సైతం అక్రెడిటేషన్ కార్డు ఉన్నప్పటికీ, రక రకాల కారణాలతో కొందరికే అనుమతి ఇస్తున్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో మీడియా పట్ల తనకున్న అభ్యంతరాలను'చట్టం' రూపంలో చేయాలే కానీ అనవసరంగా జర్నలిస్టులను తిడుతూ సమాజంలో చులకన చేయడం సరైంది కాదని కోరారు. నిజంగా సీనియర్ జర్నలిస్టుల పట్ల ముఖ్యమంత్రి కి గౌరవం ఉంటే, పక్క రాష్ట్రం కర్ణా-టక లో కాంగ్రెస్ ప్రభుత్వం సీనియర్ జర్నలిస్టులకు అమలు చేస్తున్న పెన్షన్ విధానాన్ని తెలంగాణ లో అమలు చేయాలని, అదేవిధంగా జర్నలిస్టులకు ఇల్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సమాచార శాఖ ఎంప్యానెల్ మెంట్ కూడా ఒక క్యాలెండర్ ప్రకారం కాకుండా, తమకు నచ్చిన వారికి చే-స్తున్నారని, చిన్న పత్రిక లకు ప్రభుత్వం జారీ చేసిన ప్రకటనల బిల్లులు పెండింగ్ లో ఉన్నా పట్టించుకునే నాధుడే లేడని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

# భారత స్వాతంత్ర్య సమరయోధుడు-రాం ప్రసాద్ ఆగ్యత్ (బిస్మిల్)

**మాదిరాజు వాణి**

భారతదేశ స్వాతంత్ర్యానికై రక్తం చిందించి ప్రాణాలర్పించినవారు ఆరులక్షలకు పైగా స్వాతంత్ర్యసమరయోధులున్నారు. వారిలో పండిట్ రాం ప్రసాద్ ఆగ్యత్ (బిస్మిల్) విప్లవ మార్గాన్నెంచుకొని ఉరికంబమెక్కిన ఎనలేని దేశభక్తుడు. ఈతనిని రామ్-ఆగ్యత్-బిస్మిల్ అనే మారుపేర్లతో వ్యవహరించేవారు.

బిస్మిల్ 1897 జూన్ 11 న షాజహాన్ పూర్ లో ఒక బ్రాహ్మణకుటుంబంలో జన్మించాడు. ఇతని తండ్రి పండిట్ మురళీధర్. తల్లి మూల్ మతి. అతడు ఇంట్లో తన తండ్రి నుండి హిందీని-ఒక మౌల్వీ నుండి ఉర్దూను నేర్చుకున్నాడు. మొదట అతడు ఇస్లామియా స్కూల్ ఆఫ్ షాజహాన్ పూర్ లో చదివాడు. చెడు స్నేహాలతో ఏడో తరగతి రెండు సార్లు తప్పగా తండ్రి ఆతనిని ఆంగ్లభాషాపాఠశాలలో చేర్పించాడు, తరువాత ఆతడు షాజహాన్పూర్ ఆర్య సమాజ్ లో చేరారు. స్వామి దయానంద సరస్వతి వ్రాసిన 'సత్యార్థ్ ప్రకాశ్' పుస్తకం ఆతనికి స్ఫూర్తి. ఆర్య సమాజ్ సంస్థతో అనుబంధం పెంచుకున్నాడు.

రామ్ ప్రసాద్ బిస్మిల్ చిన్నప్పటి నుంచే హిందీ, ఉర్దూలపై పట్టు సంపాదించాడు. అలవోకగా కవితలల్లే ప్రతిభను సొంతం చేసుకున్నాడు. ఆర్యసమాజ్లో సభ్యుడయ్యాడు. బ్రిటిష్వారి అకృత్యాలు చూస్తూ వస్తున్న అతడు తన కవితల రూపంలో తన ఆవేశాన్ని ప్రదర్శించేవాడు.

బిస్మిల్ తొమ్మిదోతరగతి చదువుతున్నపుడు-ఆతనికి 18 ఏళ్ల వయస్సున్నప్పుడు హిందూమహా సభనాయకుడైన భాయీ పరమానంద్ ను బ్రిటీష్ ప్రభుత్వం ఉరిదీసింది. వార్తాపత్రికలో దీన్ని చదివినపుడే ఆతనికి స్వాతంత్ర్య కాంక్ష మొదలయింది. రోజూ షాజహాన్ పూర్ లోని ఆర్యసమాజానికి వెళ్లసాగాడు. అక్కడ పరమానంద మిత్రుడైన స్వామి సోమ్ దేవ్(స్వామి సోమదేవ్ సిద్ధగోపాల్ శుక్లా) బోధనలను విని బ్రిటీష్ వారిపై ద్వేషాన్నిపెంచుకున్నాడు. ఈ సంఘటన ఆధారంగా ఇతడు 'మేరాజన్మ్' అనే పుస్తకాన్ని రచించాడు. దీని ఇతివృత్తమంతా ఏ విధంగా ఆంగ్లేయులను తరిమికొట్టాలన్నదే. అపుడే స్వామి ఆతనికి 'బిస్మిల్' అనే కలం పేరును(Pen name)సూచించాడు. ఈ పేరే రాం ప్రసాద్ కు ప్రసిద్ధమైంది. అప్పటివరకు బిస్మిల్ లో కవిని మాత్రమే దర్శించిన స్వామి- ఆతని కళ్ళల్లో ప్రజ్వరిల్లుతున్న స్వాతంత్ర్యాగ్నిని చూసాడు. ఆతనినుండి దేశం పొందవలసినదేదో గుర్తించాడు. ఇందుకు రాజకీయంగా అతడు బలపడాల్సిన అవసరముందని గుర్తించి అతనిని 1916 సం. లో లక్నోకు పంపించాడు.




బిస్మిల్ "సర్ఫరోష్ కీ తమన్నా అబ్ హమారే దిల్ మే హై...." ("విప్లవకాంక్ష మా గుండెల్లో నిండి ఉంది").. అనే విప్లవగీతాన్ని వ్రాశాడు. ఈ గీతం భారతదేశంలో పలువురి నోళ్లలో నాని స్వాతంత్ర్యాభిలాషను రగిల్చింది. నాడు భగత్సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ల నుండి నేటి యువతరం దాకా ఉఱ్ఱూతలూపింది ఈ గీతం. కొందరు సినిమాల్లో కూడా ఈ గీతాన్ని ఉపయోగించుకున్నారు.

బిస్మిల్ తల్లి నుంచి డబ్బు

చేబదులు తీసుకొని వచ్చి పుస్తకాలు ముద్రించేవాడు. మన్ కీ లహర్, క్రాంతి గీతాంజలి, బోల్షివిక్ విప్లవం, అమెరికా స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన పుస్తకాలతో పాటు. అనేక ప్రాంతీయ భాషల్లోంచి కవితలను కూడా అనువదించి బిస్మిల్ ప్రచురించాడు. పండిట్ గెండాలాల్ దీక్షిత్ తదితర స్నేహితులతో కలసి 'మాత్రివేది' అనే విప్లవవాద సంస్థను ఏర్పాటు చేశాడు. దేశభక్తిని, బ్రిటిష్ పాలనపై తిరుగుబాటును ప్రోత్సహించే కవితలు, వ్యాసాలతో కూడిన తన పుస్తకాలను అమ్మేవాడు. అట్లా పుస్తకాలను అమ్మగా వచ్చిన డబ్బుతో ఆయుధాలు కొనేవారు. ఇది తెలుసుకొన్న బ్రిటీష్ ప్రభుత్వం ఆ పుస్తకాలను నిషేధించింది. 1918 లో ఒకసారి బ్రిటీష్ పోలీసులు ఇతనిపై కాల్పులు జరపగా అతడు తప్పించుకొని యమునలో దూకి నీటి అడుగున ఈదుకొంటూ వెళ్లాడు. బ్రిటీష్ ప్రభుత్వం నిఘా వల్ల ఆయుధాల సేకరణకు ఇబ్బంది ఏర్పడింది. అంతేగాకుండా అనేకాలైన కేసులు పెట్టి ప్రభుత్వం విప్లవకారులను వేధించటంతో బిస్మిల్ 1919-1920 సం. లో అజ్ఞాతం లోకి వెళ్లాడు.

1921లో తిరిగి బయటకు వచ్చిన బిస్మిల్... ఇక మీదట విప్లవవాద కార్యకలాపాలకు దూరంగా ఉంటానంటూ అధికారులకు మాటిచ్చారు. అప్పుడే అతడు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపాడు. అహ్మదాబాద్ కాంగ్రెస్ సదస్సుకు హాజరయ్యాడు. సంపూర్ణ స్వరాజ్య తీర్మానం కోసం పట్టుబట్టి దాన్ని తీర్మానింపజేయించాడు. గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఉన్నట్టుండి నిలిపివేయటం బిస్మిల్ కు నచ్చలేదు. అంతేగాకుండా బాలగంగాధర తిలక్ లాంటి వారు అతివాదులకంటె మితవాదులకు ప్రాధాన్య మీయటం వలన కాంగ్రెస్ నుండి బయటపడ్డాడు. ఇంకా 1922 ఫిబ్రవరిలో రైతుల ధర్నాను అణచి వేయటానికి బ్రిటీష్ వారు రైతులను కాల్చి చంపారు. రైతులు తిరుగబడి 22 మంది పోలీసులను సజీవదహనం చేసారు. దీన్ని నేపథ్యాన్ని గుర్తింపని గాంధీజీని బిస్మిల్ వ్యతిరేకించాడు. ఫలితంగా కాంగ్రెస్ లిబరల్ (Liberal) –రెబిల్లియన్ (Rebellian) పార్టీలుగా విడిపోయింది. నెహ్రూ, చిత్తరంజన్ దాస్ టాండన్ లు న్యూ స్వరాజ్యపార్టీకి నాయకత్వం వహింపగా- బిస్మిల్ రెవల్యూషనరీ పార్టీకి నాయకత్వం వహించాడు.

బిస్మిల్ తన స్నేహితులు అష్వక్ ఉల్లాఖాన్తో కలసి లాలా హర్దయాళ్, సచ్చింద్రనాథ్ సన్యాల్, డాక్టర్ జాదూగోపాల్ ముఖర్జీల సారథ్యంలో1924 అక్టోబరులో హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ (H.R.A.) అనే విప్లవ సంస్థను స్థాపించారు. ఇది

తర్వాత హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్గా (H.S.R.A.) మారింది. దీని ప్రధాన లక్ష్యం ఆయుధాలు సేకరించి బ్రిటీష్ వారినెదిరించటం. ఆయుధాల ద్వారానే సంపూర్ణ స్వరాజ్యాన్ని సాధించటం. ఈ ఆయుధాల సేకరణ బాధ్యత బిస్మిల్కు అప్పగింపబడింది.

పుస్తకాల అమ్మకాలు నిషేధించటం వలన నిధుల సేకరణ బిస్మిల్ కు సాధ్యపడలేదు. చిన్న చితకా పనులు చేసి డబ్బు సంపాదించటం కంటే ఒక పెద్దపనినే చేసి బ్రీటీషువారి మెడలు వంచాలని అనుకున్నాడు. కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలనుకున్నాడు. ఆయుధాల కొనుగోలుకు బ్రిటిష్ ప్రభుత్వ ఖజానానే లూటీ చేయాలని బిస్మిల్ తదితర విప్లవకారులు నిర్ణయించుకున్నారు. అందుకు కాకోరి రైలు దోపిడికి పూనుకున్నారు. భారత జాతీయోద్యమంలో అందరినీ ఆశ్చర్యపరచిన కాకోరి రైలు లూటీకి బిస్మిల్ సారథ్యంలోనే ప్రణాళిక సిద్ధమైంది. ప్రజల నుంచి పన్నులు, ఇతరత్రా రూపాల్లో వసూలు చేసిన సొమ్మును సంచుల్లో నింపి ఈ రైలు ద్వారా బ్రిటీష్ అధికారులు ప్రభుత్వ ఖజానాకు పంపేవారు. అందుకే ఈ రైలును లూటీ చేయాలని బిస్మిల్ బృందం వారు నిర్ణయించుకున్నారు. దీనికి 1925 ఆగస్టు 9న ముహూర్తం పెట్టారు. కాకోరి అనేది లక్నోకు 12 మైళ్ల దూరంలో ఉన్న చిన్న రైల్వే స్టేషను. షాజహాన్ పూర్ నుండి లక్నోకు పోయే 8 డౌన్ ప్యాసింజర్ బండి అది. లఖ్నవూకు సమీపంలోని కకోరి రైల్వే స్టేషన్ దాటగానే రైలును లూటీ చేయా-

లనుకున్నారు. ఈ సంఘటనలో పదిమంది విప్లవకారులు పాల్గొన్నారు. వీరిలో-విప్లవకారుల్లోని రాజేంద్రనాథ్ లహరి (బెంగాల్) గొలుసులాగి రైలును ఆపాడు. చంద్రశేఖర ఆజాద్- అసఫల్లాఖాన్ (Ashfaqulla Khan) లకు డబ్బు పెట్టెనుతీసుకొని రావటానికి నియోగింపబడ్డారు. ఆ రైలుకు డ్రైవరు, అసిస్టెంట్లు బ్రిటీష్ వారే. గార్డు మాత్రం భారతీయుడైన ముకుందలాల్. వీరిపై తుపాకి గురి పెట్టారు. సొమ్మును లూటీ చేశారు. దీన్ని అవమానంగా భావించిన బ్రిటిష్ ప్రభుత్వం తనిఖీలు ముమ్మరం చేసింది. హిందుస్థాన్ రిపబ్లికన్ పార్టీ లోని (హెచ్ఆర్ఏ) లోని కొందరి వెన్నుపోటు వలన ప్రభుత్వం 40 మందిని ఒక నెల వ్యవధిలో అరెస్టు చేసారు. రామ్ ప్రసాద్ బిస్మిల్ సైతం అరెస్టయ్యారు. వీరిలో కొంతమందికి ప్రభుత్వం ధనాశ చూపింది కొంతమందిని ప్రభుత్వం అప్రూవర్లుగా మార్చుకొంది. దీనివలన బిస్మిల్-లహరి-దోపిడీ సమయంలో విప్లవకారులు రైలులో ఉన్న ప్రయాణీకులను క్రిందకు దిగవద్దన్నారు. అయినా అహ్మల్ అలీ అనే అతను రైలు దిగగా పిస్టల్ కాల్పుల్లో అతడు మరణించాడు. బ్రిటీష్ వారికి విప్లవకారులపై కేసు పెట్టటానికి ఇదో ఆధారమైంది. ఇక్కడ విప్లవకారులు మరో పొరపాటు చేసారు. వారి దుప్పటొకటి రైల్లో మరచి పోయారు. దోభీనిషా(చాకలి గుర్తు) ఆధారంగా బ్రిటీష్ అధికారులు విప్లవకారులను గుర్తింపగలిగారు. రైల్వే గార్డు ముకుందలాల్ కూడా సాక్ష్యం చెప్పాడు. బిస్మిల్-లహరి-అసఫల్లాఖాన్ – ఠాగూర్ రోషన్ సింగ్ లకు నలుగురికి ఉరిశిక్ష పడింది.

ఇంతకూ వారు దోచుకున్నది కేవలం ఎనిమిది వేల ఆరువందల రూపాయలు మాత్రమే. కాని బ్రిటీష్ ప్రభుత్వం 18 నెలలు విచారణ చేసి 11 లక్షల రూపాయలను ఖర్చుపెట్టి 1927 డిసెంబర్ 19 వ తారీకున గోరక్ పూర్ జైల్లో నలుగురిని ఉరితీసింది.

బిస్మిల్ కొన్ని భావాలు- సంఘటనలు:

స్వాతంత్ర్యసమరంలో పాల్గొనని వానికి శరీరమెందుకంటూ ''ఉన్నా దము రకలెత్తని దేహమేలా దేహికిన్'' అన్నాడు. ప్రత్యక్షంగా స్వాతంత్ర్యయుద్ధంలో పాల్గొనకుండా దూరంగా ఉండి చూస్తున్నవాడినుద్దేశిస్తూ 'తీరంలో కూర్చున్న పడవ తుఫానుతో ఎట్లా పోరాడుతుంది'. అన్నాడు. ఉరితీసే సమయంలో 'ఎప్పుడెప్పుడు నా తలను దేశానికి సమర్పిద్దామా అని నామనస్సు తొందరపడుతున్న'దంటూ "శిరమునిచ్చెడి కోర్కె యిప్పుడు చెంగలించెను నామదిన్"(సర్ఫరోజ్ కి తమన్నా) అన్నాడు. బిస్మిల్ ప్రత్యక్షంగా భారతస్వాతంత్ర్యోద్య మంలో పాల్గొనగా ఆతని తల్లి-చెల్లెలు పరోక్షంగా పాల్గొన్నారు. తల్లి ఇండ్లలో దీపాలు శుభ్రపరచి వెలిగించి డబ్బు సంపాదించి ఆయుధాల కొనుగోలునకై కొడుకునకిచ్చేది. అతని చెల్లెలు శాస్త్రిదేవి ఇండ్లలో పాచిపని చేస్తూ డబ్బులు సంపాదించి ఆయుధాలను కొని తన లంగాలో వాటిని దాచి అన్నకందజేసేది. ఈ విధంగా బిస్మిల్ కుటుంబమంతా ఆతనికి చేయూతనిచ్చింది.

అసఫుల్లాఖాన్ ఉరికి పోయే ముందర అన్న మాటలు: "ఓ బిస్మిల్ ! మా ముస్లిమ్‌లకు పునర్జన్మపై నమ్మకం లేదు. కాని నేను తిరిగి ఒక భారతస్త్రీ గా పుట్టాలను కుంటున్నాను. ఎందుకంటే ఎక్కువమంది స్వాతంత్ర్య యోధులకు జన్మనివ్వటానికి" అని అనటం యోధుని లక్షణానికి పరాకాష్ఠ.

బిస్మిల్ ను రేపు ఉరిదీస్తారనగా ఆతని తల్లి జైలుకు వచ్చింది. తల్లిని అతడు కన్నీటి పొరలమధ్య చూచాడు. దీన్ని తల్లి గమనించింది.

"నా కొడుకు ధైర్యవంతుడు. కాకపోతే ఉరిశిక్షననుభవించే మార్గాన్ని ఎందుకెంచుకుంటాడు".

'If you had to be hanged like this, then why did you choose the path of revolution?Then you shood have stepped on this path at all ! '

అని అనటం వీరమాత లక్షణం కదా! ■


NASA
నిసార్ ఉపగ్రహం ప్రయోగం విజయవంతం


బ్రిటన్--భారత్ ప్రధానమంత్రుల భేటీ

RNI No. TELTEL/2011/39497 AUGUST 2025 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st August Date of Posting:8th August




Published, Edited and Printed by T Shanti at Flat No. 504, Tower A06, Rajiv Sahabhavana Nagole-Bandlaguda, Hyderabad-500068. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-50000